PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 197 | విజయవాడ, మంగళవారం 18 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 18 February 2025 | Rs

నిరుద్యోగం... అధిక ధరలు

- ఇవే మోడీ ప్రభుత్వ అతి పెద్ద వైఫల్యాలు
- 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో భారతీయుల మనోగతం

7



బెంగళూరు సునాయాసంగా..

- బ్యాటింగ్‌లో మంధాన, బౌలింగ్‌లో రేణుక, వారేహామ్
- ఢిల్లీపై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు

6



భూకంపంతో నివాసాల నుంచి బయటకు వచ్చిన ఢిల్లీ వాసులు

ఢిల్లీ, బీహార్, సిక్కింలలో భూకంపం

భయంతో పరుగులు తీసిన ప్రజలు

న్యూఢిల్లీ : ఢిల్లీ, బీహార్, సిక్కింలలో సోమవారం భూకంపం సంభవించడంతో జనం పరుగులు తీశారు. ఢిల్లీ - దేశరాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) లోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం తెల్లవారు జామున భూమి కంపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. ఢిల్లీలో భూకంపం వచ్చిన కొన్ని గంటల తరువాత సేపటికే బీహార్, సిక్కింలోనూ భూకంపం సంభించింది. ఢిల్లీలో 5.36 గంటలకు 4.0 పాయింట్ల తీవ్రతతో భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్‌సిఎస్) ప్రకటించింది. ఢిల్లీ, నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్, మరికొన్ని ప్రాంతాల్లో భూకంపం రావడంతో ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు పరుగెత్తారు. భూకంప కేంద్రం న్యూఢిల్లీలో ఐదు కిలోమీటర్ల లోతులో కేంద్రీకృతమై ఉందని ఎన్‌సిఎస్ తెలిపింది. భూకంప తీవ్రత తక్కువై అయినా, కేంద్రం లోతు తక్కువగా(5 కిలోమీటర్ల) ఉండటం వల్ల ప్రకంపనలు విస్తృతంగా నమోదయ్యాయని ఎన్‌సిఎస్‌కు చెందిన ఒక అధికారి తెలిపారు. ఈ భూకంపం కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం వాటిల్లినట్లు వార్తలు రాలేదు. బీహార్‌లో ఉదయం 8.02 గంటలకు 4.0 పాయింట్ల తీవ్రతతో భూకంపం సంభవించినట్లు ఎన్‌సిఎస్ తెలిపింది. ఎన్‌సిఎస్ సమాచారం ప్రకారం బీహార్‌లోని సివాన్ జిల్లాలో ఈ భూకంప కేంద్రం ఉంది. భూ ఉపరితలానికి 10 కిలోమీటర్లు లోతున సిక్కింలో లాచుంగ్‌లో ఉదయం 8:13 గంటలకు భూకంపం సంభవించింది. 2.3 పాయింట్ల తీవ్రతతో వచ్చిన ఈ భూకంప కేంద్రం ఐదు కిలోమీటర్ల లోతున ఉన్నట్లు ఎన్‌సిఎస్ తెలిపింది. భూకంపం కారణంగా బీహార్, సిక్కింలో ఎలాంటి నష్టం సంభవించలేదు. 'భూ ప్రకంపనలు మళ్లీ రావొచ్చునని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ' అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించారు. న్యూఢిల్లీలో భూకంపంపై ప్రధాని ఎక్స్ వేదికగా స్పందించారు.

తొలగించే ఆలోచన లేదు

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో మంత్రి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో కొందరిని తొలగిస్తారనే అపోహలు ఉన్నాయని, తొలగించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయాలశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఉద్యోగుల రేషనలైజేషన్, పని పరిస్థితులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. సచివాలయంలో సోమవారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాలతో రేషనలైజేషన్, ఉద్యోగుల సమస్యలపై మంత్రి, జిఎస్ డబ్ల్యుఎస్ అధికారుల బృందం చర్చలు జరిపింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సచివాలయాలను పునర్ వ్యవస్థీకరించడం, ఉద్యోగులకు దిశా నిర్దేశం చేయడం, పాలనలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు అనుగుణంగా మార్చడం అవసరమన్నారు. రేషనలైజేషన్ తర్వాత ఉద్యోగులకు సరైన ప్రమోషన్ విధానాన్ని కూడా సులభతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని, డైరెక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు. ఉద్యోగులతో జరిగిన చర్చల్లో 39 సంఘాలు పాల్గొన్నాయి. అనంతరం ఎపి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం గురుస్వామి, కె అనూరాధ మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రతి ఉద్యోగికి మాతృశాఖకు బదిలీ, ప్రమోషన్ చానెల్ ప్రకటించాలన్నారు. గ్రామ, వార్డు ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ జానీపాషా, బత్తుల అంకమరావు మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్ కేడర్‌కు మార్పు చేయాలన్నారు. మల్టీపర్పస్ అనే పదాన్ని తొలగించాలని, హేతుబద్ధీకరణ అంశం మీద పూర్తిస్థాయిలో ఎటువంటి చర్యలు తీసుకుంటారనే విషయంపై ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరినట్లు వెల్లడించారు. ఎపి గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మధుబాబు బూరాడ మాట్లాడుతూ.. విలేజ్ సర్వేయర్స్‌కు ప్రమోషన్ ఛానెల్ క్రియేట్ చేస్తూ టెక్నికల్ పే ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ప్రొబేషన్ డిక్లరేషన్ ఎగ్జామ్ పాస్ కాకుండా రూ.15 వేల శాలరీ తీసుకుంటున్నవారికి ప్రభుత్వం వెంటనే ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని, రెగ్యులర్ పే స్కేలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల ఆర్లయ్య, జ్యోతి మాట్లాడుతూ.. హేతుబద్ధీకరణ ప్రక్రియలో ఇచ్చిన జిఓ ఎంఎస్ నెంబరు 1, క్లాజ్ 3ఎలో పేర్కొన్న విధంగా మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్, యాస్పిరేషన్ ఫంక్షనరీస్ ఎవరెవరు ఏ కేటగిరి కిందకు వస్తారో సమాచారం తెలపాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు.

భూముల లీజు కాదు... కార్పొరేట్ల కబ్జా

విద్యుత్ ఒప్పందాలపై వి. శ్రీనివాసరావు

- రైతులకు, వినియోగదారులకు హానికరం
- 'పెంటగాన్' అగ్రిమెంట్ వివరాల వెల్లడి
- కోట్లలో ఆదాయం...వేలల్లో విదిలింపు
- ఎకరాకు నెలకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల్లో రైతులతో కార్పొరేట్ కంపెనీలు చేసుకుంటున్న విద్యుత్ ఒప్పందాలు హానికరమని, రైతులు భూములపై హక్కు కోల్పోతారని, విద్యుత్ వినియోగదారులపై భారం పడుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. సోమవారం బాలోత్సవ భవనంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలు జిల్లాల్లో పెంటగాన్ సినర్జీ సొల్యూషన్స్ కంపెనీ రైతులతో చేసుకున్న ఒప్పందపత్రంలో వివరాలను ఆయన వెల్లడించారు. అందులో పేర్కొన్న నిబంధనల ప్రకారం రైతులు భూములపై హక్కు శాశ్వతంగా కోల్పోతారని, 30 సంవత్సరాల పాటు రైతులు వాటిని బిడ్డలకు ఇవ్వలేరని, రుణం తీసుకోలేరని, అటవీ, గిరిజన చట్టాలు వర్తించవని, కంపెనీదే తుది నిర్ణయం అవుతుందని అన్నారు. రైతుల నుండి లీజు పేరుతో తీసుకునే ప్రతి రెండున్నర లేదా మూడు ఎకరాల్లో మెగావాట్ కరెంట్ సోలార్ ద్వారా తయారవుతుందని, అదే భూమిలో మరో మెగావాట్ కరెంట్ గాలి ద్వారా కూడా ఉత్పత్తి చేసుకోవచ్చని అంటే రెండు మెగావాట్ల కరెంట్ తయారైతే సగటున సంవత్సరానికి దాదాపు 50 కోట్లు ఆదాయం వస్తుందని తెలిపారు. ఎకరాకి 20 కోట్లు వస్తే రైతులకు రూ.30 వేలు మాత్రమే ఇస్తారని, ఇంతకన్నా నిలువుదోపిడీ ఏమి ఉంటుందని ప్రశ్నించారు. ఇంత దారుణమైన ఒప్పందాలు జరుగుతున్నా ప్రభుత్వం ఏమీ మాట్లాడడం లేదని,కార్పొరేట్ కంపెనీలు రైతులను మోసం చేస్తుంటే ప్రభుత్వం చూస్తూ కార్పొరేట్ కంపెనీలకు కాపలా కాస్తుందా అని ప్రశ్నించారు. మోడీ ఆదేశంపై జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన విధానాన్నే చంద్రబాబు అమలు చేస్తున్నారని అన్నారు. కంపెనీ మూడు ఎకరాలకు 15 కోట్ల నుండి 20 కోట్లు పెట్టుబడి పెడుతుందని, సంవత్సరానికి 15 లక్షల నుండి 20 లక్షలు మాత్రమే ఖర్చవుతుందని, ఈ లెక్కన ఐదారేళ్లలో వారి మొత్తం పెట్టుబడి తిరిగి వస్తుందని, ఆ తర్వాత అంతా మిగతా 7లో

జిబిఎస్‌తో మరొకరు మృతి

విశాఖ కెజిహెచ్‌లో ఘటన

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం), అమరావతి బ్యూరో

గులియన్ బారే సిండ్రోమ్ (జిబిఎస్) కలవర పెడుతోంది. ఈ వ్యాధిగ్రస్తులు పెరుగుతుండడం, మరణాలు నమోదవుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. విశాఖలోని కింగ్ జార్జ్ హాస్పిటల్‌లో జిబిఎస్‌తో చికిత్స పొందుతున్న విజయనగరం జిల్లా లక్కవరపు కోట మండలం మల్లివీడు గ్రామానికి చెందిన రేణుకా మహంతి (63) సోమవారం మరణించారు. ఆమె ఈ వ్యాధితో ఈ నెల ఆరో తేదీన కెజిహెచ్‌లో చేరారు. సోమవారం ఉదయం కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద జిబిఎస్ రోగులను సందర్శించిన సమయంలో ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు గుర్తించారు. ఆ తదుపరి ఆకస్మికంగా తీవ్రమైన ఛాతి నొప్పి రావడంతో రేణుకా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వైద్యులు స్పందించి చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. పరిస్థితి విషమించి ఆమె మృతి చెందారు. అయితే, జిబిఎస్ వ్యాధితో ఆమె మరణించలేదని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మీడియాకు తెలిపారు. తీవ్రమైన కరోనరీ ఆర్టరీ లోపం కారణంగా మయో కార్డియల్ ఇన్‌ఫార్షన్ (గుండెపోటు)తో ఆమె మృతి చెందినట్లు పేర్కొన్నారు.

సిఎం సమీక్ష

జిబిఎస్‌పై ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమీక్షించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశం వివరాలను సచివాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి వెల్లడించారు. జిబిఎస్ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో తగిన వైద్య సేవలు, ఔషధాలు అందుబాటులో ఉన్నాయని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జిబిఎస్‌పై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందన్నారు. కేసుల వివరాలను పూర్తి స్థాయిలో విశ్లేషించి వ్యాధి సోకడానికి, విస్తరించడానికి కారణాలను గుర్తించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న ఈ వ్యాధి లక్షలో ఒకరిద్దరికీ మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు.

ఎటువంటి చికిత్సా లేకుండానే 85 శాతం మందికి ఈ వ్యాధి తగ్గే అవకాశం ఉందని, మిగిలిన 15 శాతం మందికి మాత్రమే ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షను ఇవ్వాల్సి ఉందన్నారు. గతేడాది పది ప్రభుత్వాస్పత్రుల్లో 301 కేసులు నమోదైనట్లు తెలిపారు. ప్రస్తుతం 43 కేసులు నమోదు కాగా, వారిలో 17 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని వివరించారు. ఈ వ్యాధి ఎన్‌టిఆర్ వైద్య సేవ పరిధిలోకి వస్తుందన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ స్పెషల్ సిఎస్ కృష్ణబాబు మాట్లాడుతూ ఈ వ్యాధి వ్యాప్తికి కారణాలను ఐసిఎంఆర్ బృందం పరిశీలిస్తోందని తెలిపారు.

27న ప్రభుత్వ ఉద్యోగులకు క్యాజువల్ లీవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 27న శాసనమండలి గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తమ ఓటుహక్కు ను వినియోగించుకునేందుకు వీలుగా ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసింది. ఈ మేరకు చీఫ్ ఎలక్షన్ ఆఫీసరు ఎంకె మీనా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.



నూతన సిఇసిగా జ్ఞానేష్‌కుమార్

న్యూఢిల్లీ : భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సిఇసి)గా జ్ఞానేష్ కుమార్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి పొద్దుపోయిన తరువాత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయనతోపాటు ఎన్నికల కమిషనర్‌గా వివేక్‌జోషిని నియమించారు. అంతకుముందు నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించి ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశం జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా నూతన కమిటీ నియామకం చేస్తున్నదని, సుప్రీంకోర్టులో తీర్పు వచ్చే వరకు ఓపిక పట్టాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. అయినప్పటికీ నూతన సిఇసిగా జ్ఞానేష్ కుమార్ నియామకానికే కేంద్రం మిగతా 7లో

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో

విదేశీ నిధులు వద్దు

- వెంటనే బ్యాన్ చేయాలి
- తొక్కిసలాట ఘటనలపై రైల్వే మంత్రి రాజీనామా చేయాలి
- ప్రకాశ్ కరత్ డిమాండ్



జమ్ము : దేశం తన ప్రజాస్వామ్య వ్యవస్థలో విదేశీ నిధులను కోరుకోవటం లేదని సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కరత్ అన్నారు. దానిని వెంటనే నిషేధించాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విదేశీ సంస్థలు అలాంటి జోక్యాలు చేసుకోకూడదని కోరుకుంటున్నామని చెప్పారు. అమెరికా నుంచి భారత పౌరులను తరలించటంలో భాగంగా వారి పట్ల అక్కడి యంత్రాంగం ప్రవర్తిస్తున్న తీరుపై ఒక దృఢమైన వైఖరి తీసుకోవటంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కారు విఫలమైందని అన్నారు. పార్టీ జమ్ముకాశ్మీర్ రాష్ట్ర 13వ మహాసభలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో జరిగే ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యను పెంచేందుకు అందించే 21 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయంపై కోత పెడుతున్నట్టు అమెరికాకు చెందిన డోజ్ స్పష్టం చేసిన విషయం విదితమే. దీనికి స్పందనగా కరత్ పైవిధంగా మాట్లాడారు.

సరైన పత్రాలు లేని వలసదారులను అమెరికా నుంచి తరలించే ప్రక్రియలో భారతీయుల చేతులకు బేడీలు వేసి అమాన వీయంగా ప్రవర్తిస్తున్న తీరుపై ప్రకాశ్ కరత్ ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశ పౌరుల పట్ల ఈ విధంగా వ్యవహరించటం దురదృష్టకరమని అన్నారు. "ప్రధాని మోడీ ఇటీవల తన అమెరికా పర్యటనలో ఆ దేశ అధ్యక్షుడి(డోనాల్డ్ ట్రంప్)తో ఈ విషయం గురించి లేవనెత్తి ఉండాల్సింది. మోడీ పర్యటన తర్వాత మరో రెండు విమానాలు వచ్చాయి. వారు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. వాళ్లు మన దేశ పౌరులు. అలాంటి ట్రీట్‌మెంట్‌కు అర్హులైన నేరస్థులు కారు" అని తెలిపారు. ఈ విషయంలో బిజెపి ఒక దృఢమైన వైఖరిని తీసుకోవాలన్నారు. తాము ఈ అంశాన్ని బలంగా లేవనెత్తుతామని చెప్పారు. మహాకుంభ్‌లో భాగంగా యూపీలో, ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ఇటీవల చోటు చేసుకున్న తొక్కిసలాటలపై స్పందిస్తూ.. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తగిన ఏర్పాట్లను కల్పించటంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఇది చూపించిందని వివరించారు.

అంత కరెంటు ఛార్జీలు భరించలేం

అదానీ ప్రాజెక్టుపై శ్రీలంక అధ్యక్షులు దిసనాయకే



కొలంబో : భారీగా కరెంటు ఛార్జీలు వసూలు చేసే విద్యుత్ ప్రాజెక్టులను భరించలేమని శ్రీలంక అధ్యక్షులు అనుర కుమార దిసనాయకే స్పష్టం చేశారు. ఏ ఒక్క నిర్దిష్ట కంపెనీకి లేదా దేశానికి శ్రీలంక ప్రభుత్వం ప్రత్యేక హక్కులు కల్పించదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ తొలి బడ్జెట్ సందర్భంగా పార్లమెంట్‌లో సోమవారం దిసనాయకే మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మన్నార్ విండ్ ప్రాజెక్టు నుంచి అదానీ గ్రీన్ గ్రూప్‌ను తొలగించిన శ్రీలంక ప్రభుత్వం అధికారికంగా స్పందించడం ఇదే తొలిసారి. అయితే సోమవారం ప్రసంగంలో అదానీ, భారత్ పేర్లను దిసనాయకే నేరుగా ప్రస్తావించలేదు. '50 మెగా వాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టును ఒక యూనిట్ విద్యుత్‌ను నాలుగు డాలర్ల 65 సెంట్ల వద్ద టెండర్‌ను ఆమోదించాం. అంతేకానీ, ఒక యూనిట్ విద్యుత్‌కు 8 డాలర్ల 26 సెంట్లు ధరను భరించలేం' అని దిసనాయకే తెలిపారు. 'పరిశ్రమలు, ఎగుమతిదారులు, వినియోగదారులకు సరసమైన ధరకు విద్యుత్‌ను అందించాలి. తక్కువ విద్యుత్ ఛార్జీలు ఆధారంగా ఇంధన రంగంలో పెట్టుబడులను స్వాగతిస్తాం. అంతేకానీ కంపెనీ, దేశం యొక్క పేరు ఆధారంగా పెట్టుబడులను ప్రోత్సహించం' అని అధ్యక్షులు తెలిపారు. ఉత్తర శ్రీలంకలోని మన్నార్, పూనెరిన్‌లోని విండ్ ప్రాజెక్టు నుంచి అదానీ గ్రూపును శ్రీలంకలో కొత్తగా ఏర్పడిన దిసనాయకే ప్రభుత్వం తొలగించింది. కేవలం అధిక విద్యుత్ ఛార్జీలు మాత్రమే కాకుండా, మానవ హక్కులు, పర్యావరణం వంటి అంశాల కారణంగా ఈ ప్రాజెక్టు నుంచి అదానీ గ్రూపును తప్పించినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ ప్రాజెక్టుపై శ్రీలంక సుప్రీంకోర్టులో ఇప్పటికే ఐదు పిటీషన్లు దాఖలయ్యాయి. వీటిని ఈ ఏడాదిలో కోర్టు విచారించనుంది. శ్రీలంకలోనే కాకుండా అదానీ గ్రూపునకు ఇతర దేశాల్లో కూడా ఇటీవల కాలంలో ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అమెరికా న్యాయ శాఖ అదానీ గ్రూపుపై అవినీతి ఆరోపణలతో కేసు నమోదు చేసింది. కెన్యా ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న నైరోబీ విమానాశ్రయంలో విద్యుత మౌలిక వసతుల ప్రాజెక్టును రద్దు చేసింది. అదానీ పవర్ ప్రాజెక్టు విద్యుత్ చార్జీలను పున:సమీక్షిస్తామని బంగ్లాదేశ్‌లోని యూనస్ ప్రభుత్వం ప్రకటించింది.

ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులను కొనసాగించాలి

- ఎవి నాగేశ్వరరావు, కాంతారావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పశు సంవర్ధకశాఖలో గత మూడేళ్లుగా ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులను కొనసాగించాలని స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్, వర్కర్స్, ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్.. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, కో- ఛైర్మన్ బి కాంతారావు సోమవారం పశుసంవర్ధకశాఖ మంత్రి, డైరెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులందరినీ కొనసాగిస్తూ చర్యలు చేపట్టాలని, ఖాళీల్లో మాత్రమే కొత్తవారిని నియమించాలని వారు విజ్ఞప్తి చేశారు. నూతన ఏజెన్సీతో చేసుకునే ఒప్పందంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన వేతనం రూ.21,500లను చెల్లించేలా, చట్ట ప్రకారం పిఎఫ్, ఇఎస్‌ఐ చట్ట భద్రత సౌకర్యాలు కల్పించాలని కోరారు.

జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా తిరుపతి

- ఆలయాలు ఆదాయ వనరులు కూడా ఐటిసి ఎక్స్‌పోలో సిఎం చంద్రబాబు
- హాజరైన మహారాష్ట్ర, గోవా సిఎంలు



ఐటిసిఎక్స్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, చిత్రంలో గోవా, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు, నిర్వాహకులు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

తిరుపతిని జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అంత్యోదయ ప్రతిష్ట సంస్థ ఆశా కన్వెన్షన్ సెంటర్ లో సోమవారం ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో - 2025ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చంద్రబాబు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ హిందూయిజం, జైనిజం, సిక్కిజం, బుద్ధిజం ఈ నాలుగు భారతదేశంలోనే పుట్టాయని, సనాతన ధర్మ పరిరక్షణలో వీటి పాత్ర కూడా కీలకమన్నారు. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు మాత్రమే కాదని, ఆదాయ వనరులు కూడా అని చెప్పారు. దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా రూ. ఆరు లక్షల కోట్ల రూపాయలు ఆదాయం ఆలయాల ద్వారా వస్తోందన్నారు. భక్తులు ఇచ్చే కానుకలు వారు దేనినైతే ఉద్దేశించి ఇస్తారో దానికే ఖర్చు చేయాలని, దీంతో పాటుగా ధార్మిక కార్యక్రమాలకు విని యోగం చేయాల్సి ఉందన్నారు. భారత దేశంలో కుటుంబ వ్యవస్థ బలంగా ఉందంటే, సనాతన సాంప్రదాయాలను, సంస్కృతి పద్ధతులను దఢంగా నమ్మి పాటించడమే కారణమని చెప్పారు. దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ శ్రీవారి ఆలయాలను నిర్మించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ధార్మిక కార్యక్రమాలను అమలు చేయడం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. దేవాలయాల అభివద్ధి కోసం ప్రజల నుండి ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా అభిప్రాయ సేకరణ తీసుకుంటామన్నారు. తదనుగుణంగా మంచి సలహాలతో ఆలయాల నిర్వహణ మరింత పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ హిందూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడానికి స్వాతంత్ర్యానికి మునుపే ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరోచిత పోరాటాలను చేశారన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాట్లాడుతూ టెంపుల్ కన్వెన్షన్ ద్వారా ఆధ్యాత్మికతను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి విస్తత మార్గాలు ఏర్పడతాయన్నారు. ఐటిసిఎక్స్ కార్యక్రమం మరో రెండు రోజులు జరగనుంది. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో వ్యవస్థాపకులు గిరీష్ వాసుదేవ్ కులకర్ణి, ఛైర్మన్ ప్రసాద్ లాడ్, కేంద్రమంత్రి పట్నాయక్, మహారాష్ట్ర మంత్రులు సురేష్, విశ్వజిత్, గోవా మంత్రి రోహన్, ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు పాల్గొన్నారు.

జౌళి రంగానికి అత్యధిక ప్రాధాన్యత

- హిందూపూర్‌లో రూ.500 కోట్ల పెట్టుబడి
- మంత్రి ఎస్.సవిత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



రాష్ట్రంలో జౌళి రంగానికి అత్యధిత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ఎస్ సవిత పేర్కొన్నారు. సోమవారం నాడిక్కడ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరిగిన భారత్ టెక్స్ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ టెక్స్‌టైల్ ప్రదర్శనకు 120 దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారన్నారు. పెట్టుబడిదారుల సదస్సులో రాష్ట్రంలో జౌళిరంగం అభివృద్ధికి తీసుకుంటున్న నిర్ణయాలను వివరించామన్నారు. వ్యవసాయం తరువాత చేనేత రంగంలోనే పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలున్నాయని అన్నారు. ఈ మేరకు హిందూపూర్‌లో రూ.500 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఓ ప్రతినిధి ముందుకు వచ్చారని తెలిపారు. మొత్తం ఐదుగురు పెట్టుబడుదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. రాష్ట్రంలో తయారైన వస్త్రాలను నిల్వ చేసేందుకు రష్యాలో 'వేర్ హౌస్' (గోదాం) ఏర్పాటు చేసేందుకు పెట్టుబడిదారులు ముందుకు వచ్చారని అన్నారు. 'ఒక జిల్లాకు ఒక వస్తూత్పత్తి (ఒడిఒపి)' కింద రాష్ట్రంలో 35 హ్యాండ్లూమ్స్ (చేనేత వస్త్రాలు) ఉన్నాయని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

టిడిపి కార్యాలయంపై దాడి కేసులో మరో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- గన్నవరం (కృష్ణాజిల్లా)

టిడిపి కార్యాలయంపై దాడి కేసులో నిందితుడుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్టు తర్వాత ఆ కేసులో మరో ఇద్దరు నిందితులు పఠాన్ జానీ, అబుల్ కలాం సోమవారం గన్నవరం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఎప్పటికీ 27 మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో మరో 40 మంది పరారీలో ఉన్నారు. వారిని పట్టుకునేందుకు పోలీసులు మూడు బృందాలుగా గాలిస్తున్నారు. 40 మంది నిందితుల్లో 30 మంది నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడం గమన్హారం. కనీసం బెయిల్ పిటిషన్ వేసుకొని స్తోమత కూడా వారికి లేదని, అందుకే కనిపించకుండా ఎటు వెళ్లిపోయారనే వాదన ఉంది.

ఆర్‌టిసిలో ఖాళీలు భర్తీ చేయాలి

- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో శ్రామిక్ నుంచి సూపర్‌వైజర్ పోస్టుల వరకు ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వానికి ఎపి పిటిడి (ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. రిటైరైన సిబ్బందితో పనిచేయించడం మానుకోవాలన్నారు. ఈ మేరకు సోమవారం యూనియన్ గౌరవాధ్యక్షులు షేక్ జిలాని, ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర.. ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఖాళీలను రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

24 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు, మరొకరు పరారీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం లంబసింగి నుంచి గుంటూరుకు గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాల ఆయన వెల్లడించారు. గుంటూరు రూరల్ మండలం శివారెడ్డిపాలెంకు చెందిన దమ్మాలపాటి మణికంఠ చెడు వ్యసనాలకు బానిసయ్యారు. గంజాయి విక్రయించడం ద్వారా అధిక మొత్తంలో డబ్బు సంపాదించవచ్చు అన్న ఆశతో లంబసింగి వెళ్లారు. ఈ గ్రామంలో చింతల సత్యనారాయణ వద్ద రెండు కిలోల గంజాయిను కొనుగోలు చేశారు. గుంటూరు పరిసర ప్రాంతాల్లో 10 గ్రాముల ప్యాకెట్ రూ.500కి విక్రయించారు. రెండు రోజుల క్రితం 24 కిలోల గంజాయితో సత్యనారాయణ భార్య చింతాల పద్మ గుంటూరు వచ్చారు. మణికంఠతో పాటు ఆమెను పోలీసులు పట్టుకున్నారు. సత్యనారాయణ పరారీలో ఉన్నాడని ఎస్‌పి తెలిపారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

- రాష్ట్ర వ్యాప్తంగా ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ఆందోళనలు
- గత, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- సమస్యలు పరిష్కరించకపోతే మరో పోరాటానికి సిద్ధం : సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు కదం తొక్కారు. తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. గత, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.



విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సుబ్బరావమ్మ, అంగన్‌వాడీల ఉద్యోగులు

విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన ధర్నానుద్దేశించి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడారు. రాష్ట్రంలో పేద గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. వేతనాల పెంపు తదితర సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వ హయాంలో 42 రోజులపాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించామని గుర్తు చేశారు. ఆ సందర్భంగా అంగన్‌వాడీలకు 2024 జులైలో వేతనాలు పెంచుతామని ఒప్పందం చేసుకున్నారని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని మినిట్స్ ఇచ్చారని తెలిపారు. నెలలు గడుస్తున్నా అవేవీ నేటికీ అమలు కాలేదన్నారు. అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్త పోరాటానికి మరోసారి సిద్ధమవుతామని హెచ్చరించారు. తొలుత జివిఎంసి సమీపాన ఉన్న గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లి, అనకాపల్లి, యలమంచిలి, సబ్బవరం, కె.కోటపాడు ప్రాజెక్టుల కార్యాలయాల వద్ద, అల్లూరి జిల్లాలో అరకులోయ, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, గంగవరం ప్రాజెక్టుల వద్ద అంగన్‌వాడీల ధర్నాలు జరిగాయి.

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అంగన్‌వాడీలు నిరసనలు తెలిపి సిడిపిఒకు వినతులు అందజేశారు. తిరుపతి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లోనూ ఐసిడిఎస్‌కు నిధుల కోత పెట్టడం దుర్మార్గమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నానుద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా నూజివీడు, చింతలపూడి, బుట్టాయగూడెం, కుక్కునూరు, జంగారెడ్డిగూడెంలో ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించి ఆయా సిడిపిఒలకు వినతిపత్రాలు అందించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు హాజరై మాట్లాడారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న అద్దెల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు జరిగాయి.



అనంతపురం జిల్లా గుత్తి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

శ్రీకాకుళం, నెల్లూరు, ఒంగోలు జిల్లావ్యాపంగా ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ఆందోళనలనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్ కార్యాలయాలతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు తెలిపారు. గుంటూరు ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కర్నూలు అర్బన్ సిడిపిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. నంద్యాలలో సిఐటియు కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే అఖిలప్రియకు వినతిపత్రం అందజేశారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి.

నేడు శ్రీవారి దర్శనం మే నెల కోటా విడుదల

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సుప్రభాతం, తోమల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల మే నెల కోటాను ఫిబ్రవరి 18న ఉదయం పది గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఫిబ్రవరి 18 నుండి 20వ తేదీ ఉదయం పది గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్ ద్వారా ఈ టికెట్లు పొందిన యాత్రికులు ఫిబ్రవరి 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే వారికి టికెట్లు మంజూరవుతాయి. 21న ఉదయం పది గంటలకు ఆర్జిత సేవా టికెట్లను, మధ్యాహ్నం మూడు గంటలకు వర్చువల్ సేవల కోటాను, 22న అంగప్రదక్షిణం టోకెన్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

'ఉపమాక' ఆలయ అభివృద్ధికి చర్యలు

- టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు

ప్రజాశక్తి- తిరుమల

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని ఉపమాక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని టిటిడి ఛైర్మన్ బిఆర్.నాయుడు ఎపి హోం మంత్రి వంగలపూడి అనితతో అన్నారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన హోంమంత్రి దర్శనానంతరం టిటిడి ఛైర్మన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఉపమాక ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అత్యంత ప్రాశస్త్యంగల ఈ ఆలయాన్ని 2017లోనే టిటిడికి అప్పగించారని ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని ఛైర్మన్‌ను కోరారు. దీనిపై ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో టిటిడి ఇఒ జె.శ్యామలరావు, టిటిడి బోర్డు సభ్యులు ఎంఎస్.రాజు, సిఇ సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగ్గురు మహిళా కార్మికులు దుర్మరణం

- ఆటోను ఢీకొట్టిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - చేబ్రోలు (గుంటూరు జిల్లా)

కూలి పనులకు మహిళా కార్మికులు వెళ్తున్న ఆటోను ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. ఆటో డ్రైవర్, మరో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరు-బుడంపాడు గ్రామాల మధ్య ఎంటిఆర్ (ఈస్టర్న్) కారం మిల్లు సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. చేబ్రోలు మండలం సుద్దపల్లికి చెందిన అల్లంశెట్టి అరుణ (39), కుర్రా నాంచారమ్మ (40), కోటా సీతారావమ్మ (41)తోపాటు మరికొందరు మహిళా కార్మికులు మంగళగిరి మండలం నీరుకొండ గ్రామంలో మినుము కోత పనులకు తెల్లవారుజామున ఐదుగంటలకు ఆటోలో బయలుదేరారు. నారాకోడూరు-బుడంపాడు సమీపంలో గుంటూరు నుంచి తెనాలి వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఎదురుగా ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ, నాంచారమ్మ, సీతారావమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. ఆటో డ్రైవర్, మరో ఏడుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. మృతదేహాలను జిజిహెచ్ మార్చురీకి పోలీసులు తరలించి కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన ఆర్‌టిసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంపై స్థానిక ఎమ్మెల్యే డి.నరేంద్రకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకులను జిజిహెచ్‌లో ఓదార్చడంతో పాటు క్షతగాత్రులను ఆయన పరామర్శించారు.



తోట సీతారావమ్మ (ఫైల్)



కుర్రా నాంచారమ్మ (ఫైల్)



అల్లంశెట్టి అరుణ (ఫైల్)

సిఎం విచారం

ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ విచారం వ్యక్తం చేశారు.

సిసి కెమెరాల పనితీరుపై నివేదిక ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

వ్యక్తుల అక్రమ నిర్బంధ కేసుల నేపథ్యంలో హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్న సిసి కెమెరాల పనితీరుపై నివేదిక ఇవ్వాలంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రం మొత్తం 1,392 పోలీస్ స్టేషన్లుంటే, 1001 స్టేషన్లలో మాత్రమే సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, మిగిలిన వాటిలో ఏర్పాటు చేయకపోవడానికి కారణాలతో నివేదిక ఇవ్వాలంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు సిసి కెమెరాలను ఏర్పాటు చేశారో లేదో చెప్పాలంది. పూర్తి వివరాలతో రాష్ట్రస్థాయిలో ఐటి విభాగాన్ని పర్యవేక్షించే అధికారికి నివేదికలు సమర్పించాలని డిఎస్‌పిలకు ఉత్తర్వులు జారీ చేసింది. డిఎస్‌పిలు ఇచ్చే నివేదికలను క్రోడీకరించి నివేదిక ఇవ్వాలంది. పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సిసి కెమెరాల ఏర్పాటు, వాటి నిర్వహణ, మరమ్మతులు, సిసి టివి ఫుటేజీలను భద్రం చేయడం వంటి అంశాలపై అదనపు అఫిడవిట్ వేయాలంది. రాష్ట్రంలోని జైళ్లలో 1,226 సిసి కెమెరాలు ఏర్పాటు చేయగా, 785 మాత్రమే పనిచేస్తున్నందున మిగిలిన చోట్ల ఎందుకు పనిచేయడం లేదో చెప్పాలంది. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం సిసి కెమెరాలను ఏర్పాటు కాలేదంటూ న్యాయవాది తాండవ యోగేష్ వేసిన పిల్‌పై తదుపరి విచారణను మార్చి 10కి వాయిదా వేస్తూ జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కె మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విడదల రజిని పిటిషన్‌పై విచారణ వాయిదా

చిలకలూరిపేట పట్టణ పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి విడదల రజిని, ఆమె పిఎలు నాగశెట్టి జయ ఫణీంద్ర, రామకృష్ణ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు విచారణ ఈ నెల 24కు వాయిదా పడింది. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) చట్టంలోని సెక్షన్ 173(3) కింద విచారణకు స్వీకరించదగ్గ నేరాల (కాగ్నిజబుల్) కింద కేసు నమోదు చేసే ముందు పోలీసులు తప్పనిసరిగా ప్రాథమిక దర్యాప్తు చేయాలో లేదా, డిఎస్‌పి నుంచి అనుమతి తీసుకోవాలో లేదో అనే అంశంపై వివరణ ఇవ్వాలని పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది ఈ మేరకు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిలకలూరిపేట టిడిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బిఎన్ఎస్ సెక్షన్లతో పాటు ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కూడా కేసు నమోదు చేయడాన్ని రజినితోపాటు ఇతరులు హైకోర్టులో సవాల్ చేశారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

న్యాయవాదులు తమ ప్రాక్టీస్ ధ్రువీకరణ పత్రం సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సిఒపి) దరఖాస్తులు సమర్పించే గడువును మార్చి 15 వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ ప్రకటించింది. బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారులకు ఇదే చివరి అవకాశమని చెప్పింది. దాఖలు చేసిన కేసులకు సంబంధించిన వకాలత్‌లు ఆ కేసుల్లో కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, తీర్పుల కాపీలను దరఖాస్తుదారులు జత చేయాలని, ఇతర వివరాలకు బార్ కౌన్సిల్‌ను సంప్రదించాలని తెలిపింది.

ముందస్తు బెయిల్ కోరుతూ వల్లభనేని వంశీ పిటిషన్

రియల్ ఎస్టేట్ వ్యాపారి కాసరనేని వెంకట పాండురంగారావుపై గతేడాది జరిగిన దాడి కేసులో తనను అక్రమంగా ఇరికించే కుట్ర జరుగుతోందని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ హైకోర్టును ఆశ్రయించారు. పాండురంగారావుపై దాడి ఘటనతో తనకు సంబంధం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మారాక పోలీసులు రాజకీయ కారణాలతో తనను నిందితునిగా చేర్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు.



సాగునీటి విడుదలపై అధికారులతో సమీక్షిస్తున్న సిఎం రేవంత్

కృష్ణా జలాల కోటాకు టెలీమెట్రీ విధానం

- ఖర్చును ఆంధ్రప్రదేశ్ భరించకుంటే మనమే భరిద్దాం
- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి రెండు తెలుగు రాష్ట్రాలకు నిర్ణీత కోటా అమలుకు టెలీమెట్రీ విధానమే పరిష్కారమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. టెలీమెట్రీ అమలుకు అయ్యే ఖర్చును సమ నిష్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరించేందుకు ముందుకు రాకుంటే మొత్తం ఖర్చును తెలంగాణ ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. వెంటనే టెలీమెట్రీ అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కెఆర్ఎంబికి లేఖ రాయాలని ఇరిగేషన్ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాను ఆదేశించారు. నీటి వాటాల పంపిణీ, నీటి వాటాల వినియోగాన్ని లెక్కించే బాధ్యత కేంద్ర జల సంఘంపైనే ఉందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నిర్ణీత వాటా కంటే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీటిని తరలించకుండా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఆంధ్రప్రదేశ్ ఏకపక్షంగా నీటిని తరలించే విషయంపై వెంటనే కేంద్రానికి ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించారు. కృష్ణ జలాలు వినియోగించుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, పంటల సాగు నీటి విడుదలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు.

పాలసీల అమల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాలసీల అమలులో అలసత్వం, నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రజలే ఫస్ట్ అనే విధానంతో ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకు అనుగుణంగా అన్ని శాఖల్లో, అన్ని స్థాయిల్లో అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు ఉండాలన్నారు. ఆయా శాఖల్లో అధికారులు, ఉద్యోగుల పనితీరు బాగుంటేనే, ప్రజల నుండి సానుకూల స్పందన వస్తుందన్నారు. మొక్కుబడిగా పనిచేస్తే మార్పురాదన్నారు. ప్రతి ప్రభుత్వ శాఖలో పనితీరుపై నిరంతరంగా నివేదికలు తెప్పిస్తున్నామని చెప్పారు. ప్రజలిచ్చే రేటింగ్‌పై వారానికి నాలుగు విభాగాలపై సమీక్ష చేయడం జరుగుతుందన్నారు. ప్రజల నుంచి నేరుగా వస్తున్న ఈ ఫీడ్ బ్యాక్‌ను ప్రాతిపదికగా తీసుకుని పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల డెలివరీ విషయంలోలబ్ధిదారులనుంచి అక్కడక్కడా ఫిర్యాదులు రావడంపై సిఎం అధికారులను వివరణ కోరారు. డెలివరీ సమయంలో డబ్బులు అడుగుతున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై యాక్షన్ తీసుకోవలన్నారు. ఆ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు.

అమరావతిలో ఇజ్రాయిల్ గార్డెన్

- అంతర్జాతీయ గార్డెన్ సెంటర్ ఏర్పాటుపై చర్చ
- ఎడిసి ఛైర్మన్‌కు వివరాలు అందించిన ప్రతినిధులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో అంతర్జాతీయ గార్డెన్ సెంటర్ ఏర్పాటుకు ఇజ్రాయిల్ ముందుకొచ్చింది. శీతోష్ణస్థితి ఆధారంగా అక్కడ పెంచగలిగే పండ్లు, పూలు, కూరగాయల సాగుపై ఎడిసి ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారధికి వారు ప్రతిపాదనలు సమర్పించారు. సోమవారం ఉదయం విజయవాడలోని ఎడిసి కార్యాలయంలో గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఇజ్రాయిల్ ప్రతినిధులు డేవిడ్ మిజ్రహీ, ప్రశాంత్, కిషోర్.. లక్ష్మీపార్థసారధితో భేటీ అయ్యారు. ఇజ్రాయిల్‌తోపాటు, అరబిక్ దేశాల్లో వారు నెలకొల్పిన ప్లాంట్లకు సంబంధించిన వివరాలను వివరించారు. ఇజ్రాయిల్‌లో పండించిన కూరగాయలు, వివిధ రకాల ఉత్పత్తులను వారు తీసుకొచ్చారు. ముఖ్యంగా అంతర్జాతీయంగా అభివృద్ధి చెందుతున్న అమరావతిలో ఇజ్రాయిల్ అనుబంధ ప్లాంట్ల ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఇక్కడున్న శీతోష్ణస్థితి ప్రకారం దేశీయంగా పండించే పంటలతోపాటు, అతి తక్కువ విస్తీర్ణంలో పండించేందుకు వీలుగా ఇజ్రాయిల్ పంటలను పండిస్తామని చెప్పారు. అంతర్జాతీయ గార్డెన్ సెంటర్ ఏర్పాటు చేయడం అమరావతికి కూడా కలిసి వస్తుందని, వీటితోపాటు గ్రీన్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌లో ఉన్న గ్రీన్‌టెక్ ప్రాజెక్టు వివరాలనూ సమర్పించారు. ఈ సమావేశంలో ఎడిసి హార్టికల్చర్ హెడ్ వి ధర్మజ, అర్బన్ ప్లానింగ్ హెడ్ పి సురేష్‌బాబు, కెవి గణేష్‌బాబు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)


ఐక్య పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1467వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు, స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వంటి గొప్ప ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రంలోని మోడీ సర్కారు కుట్రలు పన్నడం దుర్మార్గమన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్లకు పైబడి కార్మికులు పోరాడుతున్నా కేంద్రం ప్లాంట్ పట్ల నిర్ణయాన్ని మార్చుకోకపోవడం శోచనీయమన్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ, దేశ ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తోన్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, కార్మికులు, ఉక్కు నిర్వాసితులు ఒకేతాటిపైకి రావాల్సిన అవసరముందని తెలిపారు.

బుందేల్‌ఖండ్‌కు ఇచ్చినట్లే బనకచర్లకు కేంద్రం నిధులివ్వాలి

- సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మధ్యప్రదేశ్‌లో బెన్ ఖత్వా నదుల అనుసంధానం చేసి బుందేల్ ఖండ్ మెట్ట ప్రాంత అభివృద్ధికి రూ.45 వేలకోట్లు కేటాయించిన కేంద్రం అదే తరహాలో ఎపిలోని పోలవరం, బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానానికి నిధులు కేటాయించాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం, బనచకర్ల అనుసంధాన ప్రాజెక్టును స్వాగతిస్తున్నామని, దీనివల్ల మెట్ట ప్రాంతాల ముఖచిత్రం మారుతుందని తెలిపారు. కృష్ణా జలాల్లో 60 శాతం వాటాను కొనసాగించాలని కోరారు. తెలంగాణ చెబుతున్న 50 శాతం ప్రకారం నీటి పంపకాలను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయం విజయవాడలో ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. నాగార్జునసాగర్ జోన్-3లో ప్రస్తుతం సాగు చేసిన ఆరుతడి పంటలను కాపాడుకునేందుకు నీటిని విడుదల చేయాలని కోరారు. అలాగే బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టిఎంసిలలో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అమల్లోకి వచ్చే వరకూ ఎపికి 512, తెలంగాణకు 299 టిఎంసిలు వాడుకునేలా కెఆర్ఎంబి దగ్గర తాత్కాలిక ఒప్పందం జరిగిందని, దీన్ని యథావిధిగా అమలు చేయాలని కోరారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువల పరిధిలోని సాగర్ మూడో జోన్‌కు కేటాయించిన 12 టిఎంసిలలో ఏడు టిఎంసిలు మాత్రమే అందాయని, మిగిలిన జలాలను తెలంగాణ ప్రభుత్వం నుండి మినహాయించి రాష్ట్రానికి విడుదల చేయాలని కోరారు.



సత్తెనపల్లి కోర్టు నుండి బయటకు వస్తున్న నందిగం సురేష్

కోర్టులో లొంగిపోయిన నందిగం సురేష్

- బెయిల్ మంజూరు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా సత్తెనపల్లి కోర్టులో వైసిపి మాజీ ఎంపి నందిగం సురేష్ సోమవారం లొంగిపోయారు. రాజధాని అమరావతి ఉద్యమం సమయంలో మహిళలపై అసభ్యంగా ప్రవర్తించారంటూ అమరావతి మండలం లేమల్లెకు చెందిన మహాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా 2020 ఫిబ్రవరిలో అమరావతి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నందిగం సురేష్‌తో పాటు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మరికొందరు నిందితులుగా ఉన్నారు. తాజాగా సురేష్ ఒక్కరే కోర్టులో లొంగిపోయి బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా న్యాయమూర్తి మంజూరు చేశారు.

బడ్జెట్‌లో తమిళనాడు పేరు కూడా లేదు : ఉదయనిధి స్టాలిన్

చెన్నై : బిజెపి నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడుపై హిందీని బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తోందని డిఎంకె నేత, ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మాకు నిధులు కేటాయించలేదు. బడ్జెట్‌లో తమిళనాడు పేరు కూడా లేదు. తుఫాను విపత్తు సంభవించిన తర్వాత తమిళనాడుకు సహాయ నిధిని విడుదల చేయమని కేంద్రాన్ని అడిగాము. ఇప్పటివరకు కేంద్రం ఆ నిధుల్ని విడుదల చేయలేదు. కేవలం ఎస్‌డిఆర్ఎఫ్ నిధులను మాత్రమే విడుదల చేశారు. కేంద్రం చూపుతున్న ఇలాంటి పక్షపాత వైఖరిని తమిళనాడు ప్రజలు గమనిస్తున్నారు. కచ్చితంగా సమయం వచ్చినప్పుడు వారు సమాధానం చెబుతారు.' అని ఆయన అన్నారు.

విలేకరిపై దాడి హేయం

- పాత్రికేయులకు రక్షణ కల్పించాలి
- జర్నలిస్టు సంఘాల నిరసనలు, అధికారులకు వినతులు

ప్రజాశక్తి- యంత్రాంగం

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడు దాడి చేయడాన్ని, చంపుతానని బెదిరించడాన్ని నిరసిస్తూ జర్నలిస్టు సంఘాలు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలిపాయి. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని కోరుతూ కలెక్టర్లకు, ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సమాజ శ్రేయస్సు కోసం వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై దాడులు సరికాదన్నారు. దాడి చేసిన వేణుగోపాల్ నాయుడును వెంటనే అరెస్ట్ చేయాలని, జర్నలిస్టులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.



పార్వతీపురం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌కు, ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కె.రమేష్ నాయుడు, ఎపియుడబ్ల్యుజె నాయకులు గంగి శ్రీనివాసరావు, కిశోర్, విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్ మంతిన రమేష్ మాట్లాడుతూ.. విలేకరి రామారావుపై టిడిపి నాయకుడు దాడి చేసి చంపుతానని బెదిరించడం దుర్మార్గమైన చర్యని అన్నారు. జర్నలిస్టుపై దాడి పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుందన్నారు. పోలీసులు వెంటనే ఆయన్ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జిల్లాకు చెందిన మంత్రి తన వైఖరి తెలియజేయాలని, ఆమె స్పందనను బట్టి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జర్నలిస్టుల నిరసనకు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్లా సురేష్ మద్దతు పలికారు. విజయనగరం జిల్లా కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ డిమాండ్ చేశారు. చీపురుపల్లి మండల కేంద్రంలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. జర్నలిస్టుపై దాడిని జడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఖండించారు.

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు వివిధ జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా జర్నలిస్టులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలంటే ప్రభుత్వాలు ఇటువంటి దాడులు అరికట్టాలన్నారు. జర్నలిస్టులపై దాడుల నివారణకు కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎపిఎంపిఎ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు సరికాదన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ జర్నలిస్టు రామారావుపై దాడి చేసిన టిడిపి నేతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంపిఎ రాష్ట్ర కార్యదర్శి యేమినేని వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి ర్యాలీగా డిఐజి కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. కార్యాలయ మేనేజర్ సూర్యారావుకు, సిసి గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్.మధుసూదన్‌రావు మాట్లాడారు. పాత్రికేయుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. అనంతపురం, శ్రీసత్యసాయి, ప్రకాశం, కర్నూలు, వైఎస్ఆర్ జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నిరసన తెలిపారు. కాకినాడ, తూర్పుగోదావరి, తిరుపతి, చిత్తూరు, గుంటూరు, నెల్లూరు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ధర్నాలు చేశారు.

బెదిరింపులతో జర్నలిస్టులను లొంగదీసుకోలేరు

- మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

మక్కువ ప్రజాశక్తి విలేకరి రామారావుపై టిడిపి మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని ప్రజాశక్తి ప్రచురణాలయం సంపాదకులు, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. రాష్ట్రంలో అధికారపార్టీ నాయకులు బెదిరింపులతో జర్నలిస్టులను లొంగదీసుకోలేరని అన్నారు. పార్వతీపురంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. విలేకరిపై దాడి చేయడంతోపాటు చంపేస్తామని బెదిరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రజాశక్తి విలేకరులు నిజాయితీగా పని చేస్తారని, నిజాలు నిర్మోహమాటంగా రాస్తారని చెప్పారు. ఇటువంటి బెదిరింపులతో విలేకర్ల స్వతంత్రతనుగానీ, ప్రజాశక్తి స్వతంత్రతను గానీ దెబ్బతీయాలని చూస్తే అది వారికి సాధ్యం కాదన్నారు. ఎవరు ప్రభుత్వంలో ఉన్నా నిమిత్తం లేకుండా విధానాల ప్రాతిపదికన నిజాలను నిర్భయంగా రాస్తామని, అవినీతి, అక్రమాలు ఎక్కడ జరిగినా బయటపెడతామని, ఇది ప్రజాశక్తి విధానమని తెలిపారు. ఈ విధానానికి అనుగుణంగానే విలేకరి రామారావు వార్తలు రాశాడని తెలిపారు. దాడి చేసిన వారు తమ తప్పును దిద్దుకొని, తగిన శిక్ష అనుభవించాలని అన్నారు. ఇటువంటి దాడులకు వ్యతిరేకంగా జర్నలిస్టు సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నిర్భీతిగా వార్తలు రాస్తున్న మాల్యాడ రామారావును ఆయన అభినందించారు.



విలేకర్లతో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

ఎమ్మెల్సీ ఎన్నికలను రాజకీయమయం చేశారు

- డబ్బులు కుమ్మరించైనా గెలిచేందుకు అధికార పక్షం యత్నాలు
- విద్యుత్, ఆస్తి పన్నుల భారాలపై పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి- మంగళగిరి (గుంటూరు జిల్లా)

పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు కేటాయించిన ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రభుత్వం రాజకీయమయం, అవినీతిమయం చేసిందని, మేధావులు, విద్యావంతులు పోటీ చేయాల్సి ఉన్నా రాజకీయ నిరుద్యోగులకు అవకాశం కల్పించడం దురదృష్టకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరికి సోమవారం వచ్చిన ఆయన సిపిఎం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఒక్కో ఓటు నమోదుకు రూ.500 ఖర్చు చేసిందని, ఇప్పుడు డబ్బులు కుమ్మరించి గెలవడానికి యత్నిస్తున్నారని అన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారిని తాము కోరామని తెలిపారు. ప్రజా సమస్యలపై పని చేసే వారిని ఎన్నుకోవాలని ఓటర్లను కోరారు. రాష్ట్రంలో పెంచిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు ఈ ఎనిమిది నెలల్లో సర్దుబాటు పేరుతో రూ.15,482 కోట్ల భారం వేశారని తెలిపారు. వీటిని రద్దు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు కోట్ల విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల వినియోగదారులపై రూ.20 వేల కోట్ల భారం పడనుందని తెలిపారు. పట్టణాల్లో ఆస్తి విలువ ఆధారంగా పన్ను పెంచడానికి గత ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని సమీక్షిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పటికీ సమీక్షించకపోగా ఏప్రిల్ నుండి 15 శాతం ఇంటి పన్ను పెంచనున్నట్లుగా ప్రకటించారని వివరించారు. దీనికి వ్యతిరేకంగా పోరాడతామని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపులో శాస్త్రీయత లేదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, కార్యదర్శివర్గ సభ్యులు పి.రామారావు, ఎం.రవి, ఇ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతి జిల్లా, సత్యవేడు మండలం, శ్రీసిటి సెజ్ పరిధిలో ఇరుకులం, కొల్లడం, పెద్దింటిపాకం గ్రామాల్లో బలవంతపు భూసేకరణ ఆపాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ అప్పలస్వామి ఆర్ అండ్ఆర్ కమిషనర్ కార్యాలయంలో జెడి శ్రీలతకు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. భూములు సేకరిస్తున్న గ్రామాల్లో 2013 భూసేకరణ చట్టాన్ని అమలు పర్చకుండా గ్రామ సభలు జరిపి ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా 144 ఎకరాలు సేకరిస్తున్నామని ఎపిఐఐసి ఇంగ్లీషు పత్రికలో ప్రకటించిందని తెలిపారు. ఈ విషయంపై ఆయా గ్రామాల పరిధిలో ఒక్కరికీ సమాచారం లేదన్నారు. వీరంతా దళితులు, వీరికి ఎకరాకు మించి భూమి లేదన్నారు. పేదల భూమి బలవంతంగా తీసుకోవద్దని కోరారు. ఒకవేళ తప్పనిసరైతే 2013 భూసేకరణ చట్ట ప్రకారం అన్ని హక్కులు, సౌకర్యాలు కల్పించిన తరువాతే భూములు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీసిటి ఎస్ఇజడ్ మధ్య ఈ మూడు గ్రామాలున్నాయని, ఇక్కడి ప్రజలు పశువులు, కూరగాయలు పండించుకుంటూ ఆ భూమిపైనే ఆధారపడి జీవిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులకు న్యాయం చేయని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

అదాని కోసమే ప్రధాని అమెరికా పర్యటన

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటన అదానిని కేసుల నుంచి తప్పించడం కోసమేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏడాది కాలంగా అదాని కోసం ప్రధాని తంటాలు పడుతున్నారని, వందల మంది ప్రతినిధులను అమెరికా పంపించినట్లు చెప్పారు. బైడెన్ అంగీకరించలేదని, ట్రంప్‌తో మోడీ ఆశయం నెరవేరిందని తెలిపారు. బొంబాయి వ్యక్తి ఆర్థిక ప్రయోనాల కోసమే తిరుపతి సదస్సు అన్నారు. ఆరోగ్యశాఖలో శానిటేషన్ కాంట్రాక్టు కోసం ఆలయాల పేరును వాడుకోవడం అనైతికమన్నారు. ఇవిఎంల ట్యాంపరింగ్‌కు విదేశాల్లో వందల కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. ఇవిఎంల ట్యాంపరింగ్‌తో బిజెపి ఎన్నికల్లో గెలుస్తోందన్నారు. కుంభమేళాలో వేలాది మంది చనిపోయారని, ఎవరికీ తెలియకుండా గజియాబాదులో దహనం చేశారని విమర్శించారు. ఢిల్లీ రైల్వే స్టేషన్ దుర్ఘటనలో అనేక మంది మరణానికి బాధ్యత వహించి రైల్వేశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి, టమోటా, పత్తి, వరి, ఇతర పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని చెప్పారు. రైతులకు ఏటా ఇస్తామన్న రూ.20 వేలు అందించాలన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వాలని కోరారు. పోలవరంలో రూ.6 వేల కోట్లు అవినీతి జరిగితే విచారణకు ఎందుకు ఆదేశించలేదని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు కాకపోవడం వల్ల ప్రజలు నిరాశతో ఉన్నారన్నారు.

ఎయిడెడ్ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

- టీచర్స్ గిల్డ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో సమానంగా ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి చిన్నప్ప, ఎల్‌కె చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎయిడెడ్ పాఠశాలల్లోని 68,500 మంది పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యార్థుల వలే సాంకేతిక విద్యను అందించాలని కోరారు. తరగతి గదుల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ ప్యానల్ బిగించాలని, టాయిలెట్లు, తాగునీరు, బెంచీలు, ఆట వస్తువులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సర్వశిక్షా అభియాన్ ఎయిడెడ్ పాఠశాలలకు కూడా క్లీనింగ్ మెటీరియల్ అందజేయాలని కోరారు.

'రక్షణ కల్పించండి'

- కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, బుక్కరాయసముద్రం

తమకు రక్షణ లేదంటూ అనంతపురం జిల్లా జంతులూరు వద్ద ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థినులు ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం నిరసన చేపట్టారు. వసతి గృహానికి సరైన రక్షణ వ్యవస్థ లేకపోవడంతో బయటి వ్యక్తులు లోపలికొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థినుల రక్షణకు విశ్వవిద్యాలయ పాలకవర్గం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2018లో ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం గతేడాది వరకు తాత్కాలిక భవనాల్లో అనంతపురం నగర శివారులోని మూతబడిన ఒక ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో నడుస్తూ వచ్చింది. ఈ ఏడాది ఆగస్టులో సొంత క్యాంపస్‌లోకి మార్పు చేశారు. 900 మంది విద్యార్థులు చదువుతున్న ఈ విశ్వవిద్యాలయంలో బాలురకు ఒక వసతి గృహం, బాలికలకు ఒక వసతి గృహం ఏర్పాటు చేశారు. వసతి గృహం నిర్మాణం జరిగినప్పటికీ ఇంటీరియర్ పనులు ఇంకా నడుస్తూనే ఉన్నాయి. ఇవి పూర్తవకనే ప్రారంభించారు. ఇంటీరియర్ పనులు చేయడానికి ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నారు. వీరు పనిచేసే నిమిత్తం, లోపలికొచ్చిన సమయంలో బాత్‌రూమ్‌ల్లోకి తొంగిచూస్తున్నారని విద్యార్థినులు ఆరోపిస్తున్నారు.



రక్షణ చర్యలు చేపట్టాలని యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

గతేడాది డిసెంబర్ ఎనిమిదిన ఇలాంటి ఘటన చోటుచేసుకోగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తమ గదుల్లోకి తొంగి చూశారంటూ విద్యార్థినులు ఆందోళన బాట పట్టారు. తమకు పూర్తిస్థాయి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మధ్యాహ్నం వరకు ఆందోళన కొనసాగించారు. విద్యార్థినుల ఆందోళన విషయం తెలుసుకున్న అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీలు యూనివర్సిటీని తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యూనివర్సిటీ సిబ్బందిపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వానికి నివేదిస్తామని ఎంపి తెలియజేశారు.

ఎస్‌పికి ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి

కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థినులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని జిల్లా ఎస్‌పి జగదీష్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. విద్యార్థినులున్న వసతి గృహానికి సరైన రక్షణ లేకపోవడంతో బయటి వ్యక్తులు లోపలికి వస్తున్నారని తెలిపారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని పరిశీలించి విద్యార్థినులకు అవసరమైన పూర్తి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆలయ ఇఒ ఎం శ్రీనివాసరావు, పండితులు, స్థానిక ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ఆహ్వానించారు. ఉండవల్లిలో సిఎంను ఆయన నివాసంలో సోమవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. శ్రీశైలం మహాక్షేత్రంలో ఈ నెల 19 నుంచి మార్చి ఒకటి వరకూ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు.

టిటిడి అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.11 కోట్ల విరాళం

ప్రజాశక్తి -తిరుమల

శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.11 కోట్ల భారీ విరాళం అందింది. ముంబయిలోని ప్రసిద్ యునో ఫ్యామిలీ ట్రస్ట్‌కు చెందిన తుషార్ కుమార్ ఈ విరాళాన్ని అందించారు. ఈ మేరకు విరాళం డిడిని టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరికి అందజేశారు.

తగ్గనున్న కేంద్ర నిధులు

- ఆర్థికశాఖ తాజా అంచనాల్లో వెల్లడి
- గ్రామీణ పథకాలకు భారీ కోతలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర నిధుల్లో భారీ కోత పడనుంది. ఆర్థికశాఖ తాజాగా రూపొందించిన అంచనాల్లో ఈ విషయం వెల్లడైంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టిన వెంటనే రూపొందించిన అంచనా నివేదికలో 14 శాఖలకు 41 వేల కోట్ల రూపాయలకు పైగా వస్తాయని అధికారులు అంచనా వేశారు. దీంతో కేంద్రం నుండి నిధుల రాక సంతృప్తికరంగానే ఉంటుందన్న అభిప్రాయాన్ని ఆర్థిక శాఖ వ్యక్తం చేసింది. అయితే, బడ్జెట్ ప్రతులకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించిన అనంతరం తాజాగా రూపొందించిన అంచనా నివేదికలో పెద్ద మొత్తంలో నిధులు తగ్గనున్నట్లు వెల్లడైంది. 14 శాఖలకు 41,154 కోట్ల రూపాయలు వస్తాయన్న తొలి అంచనాలకు భిన్నంగా తాజాగా 25 శాఖలకు కలిపి 38,790 కోట్ల రూపాయలు మాత్రమే రాష్ట్రానికి రానున్న ఆర్థికసంవత్సరంలో రానున్నాయని తేలింది. ఈ స్థాయిలో నిధులు తగ్గనుండటం ఆర్థికశాఖలో చర్చనీయాంశంగా మారింది. పధానంగా కొన్ని కీలక శాఖలకు నిధులు తక్కువగా వచ్చే పరిస్థితి ఉన్నట్లు తేలింది.అత్యంత కీలకమైన గ్రామీణాభివృద్ధికి భారీగా నిధులు తగ్గుతున్నట్లు తేల్చారు. తొలుత ఈ శాఖకు 20,314 కోట్లు వస్తాయని అంచనా వేయగా తాజా లెక్కల్లో మాత్రం కేవలం 18,264 కోట్లు వస్తాయని ఆర్థికశాఖ అధికారికంగా తేల్చింది.

ఇళ్లకూ నిధులు కోత

గృహ నిర్మాణ శాఖకు తొలుత 5,328 కోట్ల వరకు వస్తాయని తేల్చగా, కొత్త లెక్కల్లో 4,351 కోట్ల రూపాయలు మాత్రమే వస్తాయని తేలింది, దీనివల్ల రాష్ట్ర ఖజానాపై భారం పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే పశు సంవర్ధకశాఖపైనా భారం పడనుంది. తొలి అంచనాల్లో 1,428 కోట్లు వస్తాయని తేల్చగా, తాజాగా ఈ నిధులు 189 కోట్లకు మాత్రమే పరిమితం కానున్నట్లు తేల్చారు.

'ఆలపాటి' గెలుపునకు కృషి

- మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో విజయవాడ బందరు రోడ్డులోని శేషసాయి కళ్యాణ మండపంలో సోమవారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, ప్రాంతీయ కో-ఆర్డినేటర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎపి మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చిల్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భారత ఎగుమతులు డీలా

- జనవరిలో పెరిగిన వాణిజ్య లోటు



న్యూఢిల్లీ : వరుసగా మూడో మాసంలోనూ భారత ఎగుమతులు పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో భారత ఉత్పత్తులు పోటీపడలేకపోవడం, డిమాండ్ సన్నగిల్లడంతో ఈ ఏడాది జనవరిలో ఎగుమతులు 2.38 శాతం క్షీణించి 37.32 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు మాత్రం 10.28 శాతం పెరిగి 59.42 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. దీంతో కొత్త ఏడాది తొలి మాసంలో భారత వాణిజ్య లోటు ఏకంగా 22.29 బిలియన్ డాలర్లకు ఎగిసిందని సోమవారం వాణిజ్య మంత్రిత్వ శాఖ గణంకాలు వెల్లడించాయి. ఎగుమతులు తగ్గడం, దిగుమతులు పెరగడం వల్ల వాణిజ్య లోటు ఏర్పాడుతుంది. ఇంతక్రితం 2024 డిసెంబర్‌లో 21.94 బిలియన్లుగా, జనవరిలో 16.55 బిలియన్లుగా వాణిజ్య లోటు చేసుకుంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 10 మాసాల్లో భారత వాణిజ్య లోటు 242.99 బిలియన్ డాలర్లకు చేరింది.

"ప్రపంచంలో ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. వస్తు సేవల రంగాల్లో భారత ఎగుమతులు మెరుగ్గా ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్, ఫార్మా, రైస్, జెమ్స్ అండ్ జువెలరీ రంగాలు ఆరోగ్యకరమైన వృద్ధిని నమోదు చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వైరుధ్యాలు, సుంకాల ప్రతీకారం ఉన్నప్పటికీ భారత్ బాగానే ఉంది." అని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ మీడియాతో అన్నారు. 2025-26లో భారత సరుకులు, సేవల ఎగుమతులు 800 బిలియన్ డాలర్లను చేరొచ్చని బర్త్వాల్ పేర్కొన్నారు. 2023-24లో 778 బిలియన్ల ఎగుమతులు జరిగాయి.

గడిచిన జనవరిలో బంగారం దిగుమతులు 2.68 బిలియన్ డాలర్లకు పెరిగాయి. గతేడాది ఇదే నెలలో 1.9 బిలియన్ల విలువ చేసే బంగారం దిగుమతయ్యింది. 2024 డిసెంబర్‌లో ఏకంగా 4.7 బిలియన్ డాలర్ల బంగారం దిగుమతి జరిగింది. ఇదే సమయంలో చమురు దిగుమతులు 15.27 బిలియన్లుగా ఉండగా.. గడిచిన నెలలో 13.43 బిలియన్లకు తగ్గాయి.

లాభాల స్వీకరణ కోసమే ఎఫ్ఐఐల విక్రయం

- మంత్రి నిర్మలా సీతారామన్



ముంబయి : విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ)లు లాభాల స్వీకరణ కోసమే భారత ఈక్విటీలను విక్రయిస్తున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టిన వారికి మెరుగైన ప్రతిఫలం అందుతోందని సోమవారం ఆమె ముంబయిలో మీడియాతో అన్నారు. భారత్‌లో పెట్టుబడులకు మెరుగైన రాబడులు ఇచ్చే వాతావరణం ఉందన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న ఒడుదొడుకుల్లో ఎఫ్ఐఐల విక్రయం కూడా ఒక్కటని ఆర్థిక శాఖ కార్యదర్శి తుహిన్‌కాంత పాండే పేర్కొన్నారు. ముఖ్యంగా అమెరికాకు చెందిన ఎఫ్ఐఐలు తిరిగి వారి దేశానికి వెళ్లిపోతున్నాయన్నారు. ధరలను స్థిరంగా ఉంచేందుకు సరఫరాకు సంబంధించిన చర్యలను ప్రభుత్వం చేపడుతోందని మంత్రి సీతారామన్ పేర్కొన్నారు. డిమాండ్‌కు సంబంధించి ఆర్‌బిఐ నిర్ణయాలు తీసుకుంటోందన్నారు.

ఎట్టకేలకు మార్కెట్లకు ఉపశమనం

ముంబయి : వరుసగా ఎనిమిది సెషన్లలో నష్టాలు చవి చూసిన దేశీయ స్టాక్ మార్కెట్లకు ఎట్టకేలకు స్వల్ప ఉపశమనం లభించింది. సోమవారం రోజంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్న సూచీలు తుదకు స్వల్ప లాభాల్లో ముగిశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 57 పాయింట్ల లాభంతో 75,997కు చేరింది. ఇంట్రాడేలో 75,294.76 కనిష్టాన్ని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 30 పాయింట్ల లాభంతో 22,959 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. మరోవైపు మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్, టిసిఎస్, ఇన్ఫోసిస్, ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లు అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

హింద్‌వేర్ నుంచి ఇమెల్డా బిఎల్‌డిసి చిమ్నీ

న్యూఢిల్లీ : ప్రముఖ గృహోపకరణాల కంపెనీ హింద్‌వేర్ కొత్తగా ఇమెల్డా బిఎల్‌డిసి చిమ్నీని ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇది వంట గదిలో పూర్తిగా పొగ లేకుండా చేస్తుందని పేర్కొంది. ఇది శక్తివంతమైన 2000 ఎంక్యూబ్ సక్షన్ కెపాసిటీ కలిగి ఉండటం ద్వారా పొగను సమర్థవంతంగా తొలగిస్తుందని వెల్లడించింది. మూడు వేరియంట్లలో ఇది లభిస్తుందని.. వాటి ధరలను రూ.48,990, రూ.51,990, రూ.54,990గా నిర్ణయించింది.


సంపాదకీయం

ఎవరికి లాభం?

'**మా** ఇంటికొస్తే ఏం తెస్తావ్? మీ ఇంటికొస్తే ఏమిస్తావ్?' అన్న చందంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరించగా, మన ప్రధాని పొగడ్తలు, ఆలింగనాలు, షేక్ హ్యాండ్‌లతో ఉబ్బితబ్బిబ్బయి లొంగిపోయినట్లుంది. పరస్పర సుంకాల విషయంలో గాని, సరైన పత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న భారతీయుల పట్ల అమానుషంగా వ్యవహరించే తీరులో గానీ, హెచ్1 బి వీసాల విషయంలో గానీ.... ఎందులోనూ అమెరికాను మన దేశ ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పించలేకపోయారు. పనికిరాని చెత్త విమానాలుగా ట్రంప్ అనుంగు మిత్రుడు మస్క్ ఏడాది క్రితం అభివర్ణించిన ఎఫ్ 35 యుద్ధ విమానాలను, మరింత ఎక్కువగా డిఫెన్స్ పరికరాలను, చమురు, సహజ వాయువును కొనుగోలు చేస్తామని, అమెరికా వాణిజ్య లోటును తగ్గిస్తామని ఒప్పందం చేసుకుని వచ్చారు. 'మోడీ నాకంటే చాలా గట్టిగా, మెరుగ్గా బేరమాడగలరు. ఆయనతో పోటీ కూడా పడలేను' అంటూ ట్రంప్ ప్రస్తుతించారు. నిజంగా ఎవరు బాగా బేరమాడారు? మోడీ అమెరికా చేరడానికి ముందే అదానీకి శిక్ష పడకుండా అక్కడి చట్టాన్ని ట్రంప్ రద్దు చేసి, మోదం కలిగించారు. పరస్పర సుంకాలు (రెసిప్రోకల్ టారిఫ్స్) ఫైలుపై ట్రంప్ సంతకం చేశారు. భారత్‌సహా ఏ దేశానికీ ఈ విషయంలో మినహాయింపు ఉండదని ప్రకటించారు. ఆ విషయాన్ని మోడీ ముందే కుండబద్దలు గొట్టారు. ప్రపంచ వాణిజ్యంలో అభివృద్ధి చెందిన దేశాలు, వర్ధమాన దేశాల మధ్య పన్నుల్లో తేడాలు ఉంటాయి. అలా చేయకపోతే వర్ధమాన దేశాలు తీవ్రంగా నష్టపోతాయి. మోడీ అమెరికా పర్యటనకు ముందే హడావిడిగా హార్లే డేవిడ్‌సన్ బైకులు, టెస్లా కార్లపై సుంకాలను భారీగా తగ్గించినా... అణు ప్రమాదాలు జరిగితే విదేశీ సంస్థలు కాకుండా కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందంటూ పార్లమెంట్‌లో ప్రకటించి, సాగిలపడి అగ్రరాజ్యానికి సంతృప్తి కలిగించారు. ఆ విధంగా ట్రంప్ తన దేశ బహుళజాతి కంపెనీలకు, మోడీ తన అనుంగు మిత్రునికి ప్రయోజనాలు నెరవేర్చారు.

సరైన ధ్రువపత్రాలు లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారి పట్ల ట్రంప్ ప్రభుత్వ అమానుషత్వంపై ప్రపంచమంతా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ వలసదారులంతా ఇన్నాళ్లూ... అతి తక్కువ వేతనాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మెరుగవడంలో కీలక పాత్ర వహించిన వారే కదా! బందిపోట్లు, కరడుగట్టిన నేరస్తుల పట్ల వ్యవహరించినట్లుగా కాళ్లకు చేతులకు బేడీలు వేసి, అన్నపానీయాలు లేకుండా, యుద్ధ విమానాల్లో పంపించడం పట్ల చిన్న దేశాలు సైతం తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేసినా...నిరసన తెలిపే ధైర్యం కూడా భారత ప్రధాని చేయలేదు. అనుమతి లేకుండా ఉంటున్న వలసదారులను పంపేటప్పుడు ఆయా దేశాలకు తెలియజేయాలని, ఆ దేశాల అనుమతితోనే పంపించాలని సుప్రీంకోర్టులోనూ, పార్లమెంట్‌లోనూ చెప్పిన విధానాన్నయినా... అమలు చేయాలన్న స్పృహే కనిపించలేదు. హెచ్1బి వీసాలపై ఇండియాకు ఇబ్బందేమీ ఉండదన్న భరోసా కూడా తీసుకోలేకపోయారు. ఇక చౌకగా, ఇరాన్, రష్యాల నుంచి మన కరెన్సీలో కొనుగోలు చేస్తున్న చమురు, గ్యాస్ కొనుగోళ్లను బాగా తగ్గించుకుని, అమెరికా నుంచి అత్యధికంగా, ఎక్కువ ధరకు డాలర్లలో కొనుగోలు చేయడం వల్ల భారత్‌కు తీవ్రమైన నష్టం. ట్రంప్ గెలిచినప్పటి నుంచి డాలర్లు మన దేశం నుంచి తరలిపోతుండగా, రూపాయి ఎన్నడూ లేనంతగా క్షీణిస్తున్న నేపథ్యంలో డాలర్లలో వాణిజ్యం వల్ల లాభమేమిటి? ఎఫ్ 35 యుద్ధ విమానాలు అమెరికా నుంచి కొనుగోలు చేసేందుకు, డిఫెన్స్ వాణిజ్యాన్ని పెంచుకునేందుకు మరో ఒప్పందం. ఈ విమానాలు మనకమ్మిన అమెరికా...అంతకు ముందు ఎఫ్ 16 విమానాలను పాకిస్థాన్‌కు సైతం విక్రయించింది కదా! సరిహద్దు సమస్యలో సాయం చేస్తామంటున్నారు...పూర్వపు స్థాయిలో సంబంధాలు మెరుగుపరుచుకుంటున్న చైనా, భారత్‌లు మధ్య తంపులు పెట్టకుండా ఉంటే చాలు! ట్రంప్‌తో భేటీలో సంకెళ్లతో మోడీ ఉన్నట్టు కార్టూన్ వేసిన తమిళ వెబ్‌సైట్ 'వికటన్'ను బ్లాక్ చేశారు. విమర్శను అణచివేయడం మితవాద శక్తుల ప్రధాన లక్షణం. మొత్తంగా చూస్తే ప్రధాని మోడీ అమెరికా పర్యటన భారత్‌కు నష్టదాయకంగాను, అగ్రరాజ్యానికి లాభకరంగానూ సాగిందన్నది నిర్వివాదాంశం. వ్యూహాత్మక భాగస్వామ్యం పేరిట అమెరికాకు జూనియర్ భాగస్వామిగా భారత్‌ను మార్చే ఈ విధానాలను దేశ ప్రజలు నిరసించడం అవశ్యం.

మంచి మాట



సామాన్య ప్రజలకు విద్య మాతృభాష ద్వారానే సాధ్యమవుతుంది. ప్రజల భాషకి, సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంది.

- ఎన్.ఎఫ్.ఎస్. గ్రుండ్‌విగ్,

ఫోక్ స్కూల్ రూపకర్త, డెన్మార్క్.

N. F. S. Grundtvig

పెట్టుబడిదారీ విధానం నుండి పుట్టే అమానవీయత

'**అ**తి ఉత్తమమైన పెట్టుబడిదారీ వ్యవస్థ కన్నా, అతి చెత్తదైన సోషలిస్టు వ్యవస్థ కూడా మెరుగ్గా ఉంటుంది' అని ప్రముఖ మార్క్సిస్టు తత్వవేత్త జార్జి లూకాక్స్ ఒక సందర్భంలో అన్నాడు. 1969లో ఒకసారి, మళ్ళీ 1971లో రెండవసారి అతడు ఈ వ్యాఖ్య చేశాడు. అప్పటికి సోవియట్ యూనియన్‌లో, తూర్పు యూరప్ దేశాల్లో అమలులో ఉన్న సోషలిజం గురించి అతనికి సన్నిహితంగా తెలుసు. పశ్చిమ దేశాలలోని వామపక్ష బృందాలు ఈ వ్యాఖ్యపై ఒకింత ప్రతికూలంగానే స్పందించాయి. కాని ఇటీవల అమెరికా నుండి భారత దేశానికి వెళ్ళగొట్టిన పౌరులను, ముఖ్యంగా మహిళలను, చిన్న పిల్లలను, కాళ్ళకు, చేతులకు బేడీలతో, సైనిక విమానాల నుండి దిగుతుండగా చూసినవారికి ఆనాడు లూకాక్స్ అన్నది తప్పకుండా గుర్తుకు వస్తుంది. కనీసం రెండు విషయాల్లో ఆనాటి సోవియట్ యూనియన్ గాని, తూర్పు యూరప్ దేశాలు కాని ఈ నాటి ఏ పెట్టుబడిదారీ దేశం కన్నా చాలా మెరుగైన స్థాయిలో ఉన్నాయి.



ప్రభాత్ పట్నాయక్

మొదటిది: అగ్రగామిగా ఉన్న పెట్టుబడిదారీ దేశం అమెరికా తన దేశం నుండి ప్రజలను వెళ్ళగొట్టడం వెనుక కనిపించే జాతి విద్వేషం సోషలిస్టు దేశాలలో అధికారికంగా మచ్చుకైనా కనిపించేది కాదు. దానర్థం సోవియట్ యూనియన్‌లో అప్పుడు ప్రజల మధ్య ఏ జాతి విభేదాలూ లేవని కాదు. వారి మధ్య అక్కడక్కడా పొడచూపిన జాతి విద్వేష భావాలు అక్కడ సోషలిజం కుప్పకూలిన సందర్భంలో బాహాటంగా వెల్లడయ్యాయి. సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లోని అభ్యుదయ వాదులు ఈ మధ్య కాలంలో జాతి విద్వేషాలు లేని వాతావరణం కోసం చేసిన ప్రయత్నాలు మనకు తెలుసు. అమెరికన్ సమాజానికి జాతి విద్వేషం లేదని, ఇప్పుడు వ్యక్తమైన జాతివ్యతిరేక ధోరణి ట్రంప్ వల్ల, అంటే ఇప్పుడు అధికారంలో ఉన్న నయా ఫాసిస్టు మూక వలన వచ్చిందే తప్ప మరొకటి కాదని చాలా మంది భావించవచ్చు కూడా.

ట్రంప్ చేసేదంతా పెట్టుబడిదారీ విధానమేనని అనవలసిన పని లేదు. కాని, పెట్టుబడిదారీ విధానంతో నిమిత్తం లేని ఒక ధోరణిగా ట్రంప్ వైఖరిని చూడడం తప్పు. ఆధునిక కాలంలో జాతి దురహంకారం అనేది సామ్రాజ్యవాదం నుండే ఉత్పన్నమైంది. ఇక సామ్రాజ్యవాదం అనేది లేని పెట్టుబడిదారీ వ్యవస్థను ఇప్పుడు ఊహించడం కూడా అసాధ్యం. పెట్టుబడిదారీ విధానంలోని అభ్యుదయ వాదులు కూడా సామ్రాజ్యవాదాన్ని కాలం చెల్లిన ఒక దోపిడీ విధానంగా, తిరస్కరించాల్సిన విధానంగా పరిగణించరు. అది అభివృద్ధికి దూరంగా ఉండిపోయిన వ్యవస్థలకు ఆధునికతలను, ప్రగతిని తీసుకువచ్చే ఒక విధానం అని వారు భావిస్తారు. సామ్రాజ్యవాదమే గనుక లేకుంటే అటువంటి వెనుకబడిన వ్యవస్థలు తమంతట తాముగా అభివృద్ధిని సాధించలేవని, సామ్రాజ్యవాదం వలన ఆ వ్యవస్థలకు ఏ కీడూ జరగదని, సామ్రాజ్యవాదాన్ని విస్తరింపజేసే వారు ఒక ఉన్నత జాతికి చెందిన మానవులవడం మూలంగానే వారు ఈ విధంగా తక్కినవారిని ఉద్ధరించగలుగుతున్నారనే అభిప్రాయం అందులో అంతర్లీనంగా ఉంది. నేటి సంపన్న దేశాలలోని అభ్యుదయ వాదుల ఉద్దేశ్యాలు ఎంత మంచివైనప్పటికీ, వారు సామ్రాజ్యవాదాన్ని గనుక తిరస్కరించకపోతే, జాతి విద్వేషానికి తాము అతీతంగా ఉన్నట్టు వారు చెప్పుకోజాలరు. ఇటీవల జరిగిన రెండు యుద్ధాలకూ లభించిన విశాల మద్దతును చూస్తే ఈ 'అభ్యుదయ' శక్తులు సామ్రాజ్యవాదాన్ని తిరస్కరించరని స్పష్టం అవుతోంది. ఆ రెండు యుద్ధాల్లో ఒకటి ఏకంగా ఒక జాతినే నిర్మూలించే లక్ష్యంతో జరిగితే, రెండవది పశ్చిమ దేశాల సామ్రాజ్యవాద విస్తరణ లక్ష్యంతో జరుగుతోంది.



అంటే జాత్యహంకారం అనేది సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో అంతర్లీనంగా కొనసాగుతోందని, ఏదో అక్కడక్కడా వ్యక్తం అయ్యే వ్యతిరేకత మాదిరిగా కాకుండా, పాలక వర్గాలలో, ఉదారవాదులతో సహా ఉన్నత స్థాయిలో సైతం వ్యక్తం అవుతోందని గమనించాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో కూరుకున్నప్పుడు ఈ జాత్యహంకారానికి ఒక కొత్త ఊపు వస్తుంది. గుత్త పెట్టుబడి కొందరు నిస్సహాయులైన వలసదారులను "పరాయివారు"గా గుర్తించి వారి కారణంగానే తమ ఆధిపత్యం దెబ్బ తింటోందన్నట్టు చిత్రిస్తాయి. నిజానికి ఇదంతా కార్మిక వర్గాన్ని చీలగొట్టేందుకే ఉద్దేశించిన ఎత్తుగడ. సోషలిస్టు సమాజాలు ఇందుకు పూర్తి భిన్నం. అవి జాత్యహంకారానికి పూర్తి వ్యతిరేకంగా ఉండడమే గాక ఎప్పుడైనా తమ దేశాల్లో జాతి విద్వేష ధోరణులు తలెత్తితే వాటిని బలంగా అణచివేశాయి. ఇలా అణచివేయడం అన్యాయం అని ఎవరైనా వాదించవచ్చు. అది న్యాయమో, అన్యాయమో పక్కన పెడితే అది ఎట్టి పరిస్థితిలోనూ ట్రంప్ మాదిరిగా జాతి విద్వేషాన్ని వ్యక్తం చేసే దశను తలెత్తనివ్వలేదు.

ఇక సోషలిస్టు దేశాలు సంపన్న పెట్టుబడిదారీ దేశాలతో పోల్చితే మెరుగైన ధోరణిని వ్యక్తం చేసిన రెండో అంశం పూర్తి స్థాయిలో ఉపాధిని కల్పించడం. నిరుద్యోగం ఉన్నప్పుడు వెలుపల నుండి వలసలు వచ్చినవారి పట్ల ద్వేషం కలిగే అవకాశం ఉంటుంది. ఆ నిరుద్యోగమే లేకపోతే ద్వేషం కలిగేందుకు ప్రాతిపదికే ఉండదు. సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో నిరుద్యోగం పెరుగుతున్నందు వల్లే వలసదారుల పట్ల విద్వేషాన్ని రాజేయడానికి భూమిక ఏర్పడింది.

తమ తమ స్వంత దేశాల్లో నిరుద్యోగం బాగా తీవ్రంగా ఉన్నందువల్లే మూడవ ప్రపంచ దేశాల నుండి ప్రజలు అమెరికా వంటి దేశాలకు వలసలు పోవాలనుకుంటారు. ఇలా వలస పోయేవారందరూ పూర్తి నిష్ఠ దరిద్రులేమీ కాదు. అక్రమ మార్గంలో అమెరికాలోకి ప్రవేశించడానికి గాను దళారీలకు వారిలో ఒక్కొక్కరూ 40 నుండి 50 లక్షల రూపాయల దాకా చెల్లించుకుంటున్నారంటే వారికి ఎంతో కొంత స్తోమత ఉందనే భావించాలి. అయినా వాళ్ళు వలసలు పోదలచుకున్నారంటే అందుకు రెండు కారణాలు ఉండాలి: మొదటిది: మాతృ దేశంలో తనకు తగిన ఆదాయాన్ని ఇవ్వగల ఉద్యోగం లేకపోవడం, రెండవది: అతని సామాజిక హోదా కారణంగా మాతృ దేశంలో తీవ్ర వివక్షతను ఎదుర్కోవలసి రావడం. ఈ రెండు కారణాలకూ వెనుక, తన మాతృ దేశంలో పెట్టుబడిదారీ పంథాలో అభివృద్ధి సాధించాలనే విధానాలు అమలు కావడమే మూల కారణం. దేశ జిడిపి ఎంత వేగంగా పెరిగినా, ఎన్ని లక్షల కోట్ల సైజుకు ఆ దేశపు జిడిపి చేరుకున్నా, పెట్టుబడిదారీ పంథాను అనుసరించినంత కాలమూ, పైన చెప్పిన రెండు కారణాలూ అలానే కొనసాగుతూ వుంటాయి. అందుచేత ప్రజల్లో ఒక సెక్షన్ ఎప్పుడూ విదేశాలకు వలస పోవాలనే అనుకుంటూ వుంటారు.

75 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఇక్కడి నుండి బైటకు వలసలు పోవాలనే ప్రజానీకం ఉన్న సమాజం కొనసాగడం సిగ్గుచేటు. అటువంటి వలసలు పోయినందు వలన వారిని జంతువుల మాదిరిగా కాళ్ళూ చేతులూ కట్టేసి వెనక్కి తోలేసే ప్రమాదం ఉందని తెలిసి కూడా అందుకు వారు సిద్ధపడే విధంగా సమాజం వారిని నెడుతోంది. మూడవ ప్రపంచ దేశంలో పెట్టుబడిదారీ పంథాలో అభివృద్ధి సాధించాలనుకుంటే ఇటువంటి పరిస్థితే ఉత్పన్నం ఔతుంది.

> **అసలు అమెరికన్ సమాజం మొత్తంగానే బైట నుండి వచ్చిన వలసదారులతో ఏర్పడినటువంటిది. కాని అక్కడి నుండి ట్రంప్ లాంటివారు తయారై, ఎవరేమంటారో, ఏం పర్యవసానం ఎదురౌతుందోనన్న వెరపు లేకుండా వలసదారులను వెనక్కి పంపేస్తున్నారు. యూరోపియన్ వలసదారులు తమ ఖండంలో తలెత్తిన తీవ్రమైన నిరుద్యోగాన్ని తప్పించుకోడానికి అమెరికా ఖండానికి పోయి అక్కడి స్థానికుల నుండి భూములను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. కాని బూర్జువా అర్థశాస్త్ర పండితులు మాత్రం శ్రామిక శక్తి ఎంత వేగంతో పెరుగుతుందో, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కూడా అంతే వేగంతో పెరుగుతుంది అంటూ పూర్తి బోగస్ వాదనలను ప్రచారం చేస్తూంటారు. ఆ వాదనే సరైనదైతే ఇప్పుడు అమెరికాకు వలసలు పోతున్న వారందరి వలనా అక్కడ శ్రామిక శక్తి మరింత పెరిగి, దాని వలన అమెరికా ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందాలి కదా? మరి ఆ వలసదారులను వెనక్కి తోలేయడం దేనికి?**

అసలు అమెరికన్ సమాజం మొత్తంగానే బైట నుండి వచ్చిన వలసదారులతో ఏర్పడినటువంటిది. కాని అక్కడి నుండి ట్రంప్ లాంటివారు తయారై, ఎవరేమంటారో, ఏం పర్యవసానం ఎదురౌతుందోనన్న వెరపు లేకుండా వలసదారులను వెనక్కి పంపేస్తున్నారు. యూరోపియన్ వలసదారులు తమ ఖండంలో తలెత్తిన తీవ్రమైన నిరుద్యోగాన్ని తప్పించుకోడానికి అమెరికా ఖండానికి పోయి అక్కడి స్థానికుల నుండి భూములను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. కాని బూర్జువా అర్థశాస్త్ర పండితులు మాత్రం శ్రామిక శక్తి ఎంత వేగంతో పెరుగుతుందో, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కూడా అంతే వేగంతో పెరుగుతుంది అంటూ పూర్తి బోగస్ వాదనలను ప్రచారం చేస్తూంటారు. ఆ వాదనే సరైనదైతే ఇప్పుడు అమెరికాకు వలసలు పోతున్న వారందరి వలనా అక్కడ శ్రామిక శక్తి మరింత పెరిగి, దాని వలన అమెరికా ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందాలి కదా? మరి ఆ వలసదారులను వెనక్కి తోలేయడం దేనికి? అమెరికాలో నిరుద్యోగం ఇప్పుడు ఎంత తీవ్రంగా ఉందంటే, ట్రంప్ మాదిరిగా వలసదారులను నిర్దాక్షిణ్యంగా వెనక్కి పంపడాన్ని కూడా అక్కడ స్థానికులు సమర్థించే పరిస్థితి ఏర్పడింది.

ఇప్పుడు పరిస్థితి ఎంత అపహాస్యంగా తయారైందంటే, జర్మనీలో అత్యంత వామపక్ష పార్టీగా పరిగణించబడే సహ్రా వేజెన్‌నెక్ట్ నాయకత్వంలోని పార్టీ కూడా (ఇది తన మాతృ సంస్థ అయిన డై లింక్ నుండి విడగొట్టుకుంది. ఆ పార్టీ నాటో సాగిస్తున్న యుద్ధాలకు మద్దతునివ్వడమే విడగొట్టుకోడానికి కారణం) జర్మనీ లోని మితవాద అధికార పార్టీల కంటే వలస కార్మికుల విషయంలో భిన్నంగా ఏమీ లేదు. వలసదారుల స్వదేశాలలోనూ, వాళ్ళు వలస పోదలుచుకున్న దేశాలలో కూడా నిరుద్యోగం సర్వత్రా నెలకొంది. పెట్టుబడిదారీ వ్యవస్థ కొనసాగినంత కాలమూ ఈ నిరుద్యోగం వెన్నాడుతూనే వుంటుంది. పైగా సంక్షోభ కాలాల్లో మరింత ముదిరిపోతుంది. ఆ క్రమంలోనే అమానవీయంగా మనుషుల్ని పశువుల మాదిరిగా వెనక్కి తోలేయడం వంటివి కానవస్తాయి.

సోషలిస్టు దేశాలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉండేవి. ఆ దేశాలు నిరుద్యోగాన్ని కాకుండా శ్రామికుల కొరతను ఎదుర్కొన్నాయి. ప్రముఖ హంగేరియన్ ఆర్థికవేత్త జానోస్ కొర్నాయ్ ఎంత మాత్రమూ సోషలిస్టు కాదు. కాలెక్కీ సూత్రాన్ని అనుసరించి అతగాడు "డిమాండ్ కొరతను ఎదుర్కొనే వ్యవస్థ"కి, "వనరుల కొరతను ఎదుర్కొనే వ్యవస్థ"కి మధ్య తేడాను చూపించే ప్రయత్నం చేశాడు. పెట్టుబడిదారీ వ్యవస్థలో డిమాండ్‌కు కొరత ఉంటుందని, అదే సోషలిజంలోనైతే వనరులకి కొరత ఉంటుందని అతడు వాదించాడు. మాజీ సోషలిస్టు దేశాలలో సరుకులకు కొరత, రేషనింగ్, పొడుగాటి క్యూలు దర్శనం ఇచ్చేవి. దానికి కారణం అక్కడ ప్రజలు ఉత్పత్తి చేసినదాని కన్నా వారి వద్దనున్న కొనుగోలు శక్తి ఎక్కువ. అంటే వారి వద్దనున్న మానవ వనరులతో సహా అన్ని వనరులనూ వారు ఉపయోగించుకున్నా, ఇంకా వారి కొనుగోలు శక్తికి సరిపడా అక్కడ ఉత్పత్తి లేదని మనం గ్రహించాలి. నిజానికి ఆధునిక కాలంలో పూర్తి స్థాయిలో ఉపాధి కల్పన సాధించగలిగినది కేవలం సోషలిస్టు దేశాలు మాత్రమే. అందుకే అక్కడ కార్మికుల కొరత తీర్చడం కోసం మహిళలలో ఉద్యోగాలు చేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దాని వలన బలమైన సామాజిక ప్రభావాలు కలిగాయి. ఉద్యోగాలు పొందడం వలన, అక్కడి ప్రజలు నిరుద్యోగం ఫలితంగా కలిగే అవమాన భారం నుండి తప్పించుకున్నారు.

ఇప్పుడు వాస్తవంగా ఉనికిలో కొనసాగుతున్న సోషలిస్టు దేశాలకు వ్యతిరేకంగా కూడా చాలా రాతలు రాస్తున్నారు. వారిలో కొందరు వామపక్షవాదులు కూడా ఉన్నారు. ఈ రచనల వలన పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం లేదు అనే అభిప్రాయం బలంగా కలుగుతోంది. కాని వాస్తవం దానికి పూర్తి భిన్నం. మనం పెట్టుబడిదారీ విధానాలను అమలు చేస్తున్నంత కాలమూ చాలామంది శత కోటీశ్వరులను తయారు చేయవచ్చేమో కాని సామ్రాజ్యవాదుల పాలన నాటి నుండి మనల్ని వెంటాడుతున్న 'తక్కువ స్థాయి భారతీయులు' అనే అవమానకర ముద్ర మాత్రం మనల్ని వెంటాడుతూనే వుంటుంది. సాధారణ కార్మికులు పశువుల మాదిరిగానే చూడబడతారు. ఒకవేళ వాళ్ళు మన దేశాన్ని విడిచి పెట్టి వేరే దేశాలకు తరలిపోయినా, అక్కడి నుండి వాళ్ళు కాళ్ళకు, చేతులకు సంకెళ్ళతో మళ్ళీ వెనక్కి పంపబడతారు. ఒక్క సోషలిస్టు సమాజం మాత్రమే ఈ నిరుద్యోగం అన్న శాపం నుంచి మనల్ని విముక్తి చేయగలదు. బోనులోని జంతువుల స్థాయి నుండి మనకి విముక్తి లభించగలదు. గత కాలపు పొరపాట్ల నుండి నేర్చుకుని మెరుగైన పద్ధతిలో సోషలిజం నిర్మాణం వైపు పాటు పడడమే పరిష్కారం.

/ స్వేచ్ఛానుసరణ /

కన్నతల్లి ఆఖరి చూపునకూ అనుమతించని కాషాయ కర్కశత్వం!

వ్యాఖ్య

తన కన్నతల్లి వృద్ధాప్యంలో ఉన్నపుడు, చివరి రోజు వరకు ఆమెను చూసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ అనేక సార్లు వెళ్లారు. ఆమెకు సేవ చేశారని కూడా వార్తలు చదివాం. చిత్రాలను చూశాం. కానీ అలాంటి మరో తల్లిని చూసేందుకు ఆమె కుమార్తెకు వీసా నిరాకరించిన అదే పెద్దమనిషి తీరును ఎలా చూడాలి?

ఈ ఏడాది జనవరి తొమ్మిదిన ఆన్‌లైన్ ద్వారా క్షమ, ఆమె భర్త వీసా దరఖాస్తులను సమర్పించగా దాదాపు నెల రోజుల పాటు దరఖాస్తును తొక్కి పట్టి ఏ కారణం చెప్పకుండా మానసిక ఆందోళనకు గురిచేశారు. చివరికి భర్త కాల్విన్ ప్రీస్ట్‌కు వీసా మంజూరు చేసి, క్షమకు తిరస్కరించారు.



ఎం. కోటేశ్వరరావు

బెంగళూరులో ఉంటున్న తల్లి వసుంధరా రామానుజమ్‌ను పరామర్శించే నిమిత్తం ఇండియన్-అమెరికన్ మహిళ క్షమా సావంత్ (51) గతేడాది మే నెల నుంచి మూడు సార్లు దరఖాస్తు చేశారు. అమెరికాలోని మన దౌత్య కార్యాలయాలు అత్యవసర వీసా నిరాకరించాయి. తీవ్ర నేరారోపణలతో జైళ్లలో ఉన్న నిందితులకు, శిక్షలు పడిన వారికి కూడా ఇలాంటి కారణాలతో పరిమిత బెయిలు మంజూరు చేసిన ఉదంతాలు మనకు తెలిసిందే. క్షమ సావంత్ నేరస్థురాలు కాదు, మన దేశ ఉగ్రవాద లేదా మరొక నిషేధిత జాబితాలో ఆమె పేరు లేదు. ఎలాంటి కేసులు లేవు. కానీ కారణాలు చూపకుండానే మీరు తిరస్కరణ జాబితాలో ఉన్నారంటూ అమెరికా వాషింగ్టన్ రాష్ట్రంలోని సియాటిల్ నగరంలో భారత కాన్సులేట్ దౌత్య కార్యాలయం 2025 ఫిబ్రవరి మొదటి వారంలో వీసా నిరాకరించింది. కారణం ఏమిటో చెప్పాలంటూ గట్టిగా అడిగినందుకు, చెప్పాల్సిన పని లేదని, కార్యాలయంలో అక్రమంగా ప్రవేశించారంటూ పోలీసులను పిలిపించింది. భర్త కాల్విన్ ప్రీస్ట్‌కు వీసా మంజూరు చేసి తనకు నిరాకరించటానికి నరేంద్ర మోడీ విధానాలను వ్యతిరేకించే రాజకీయ కారణాలు తప్ప మరొకటి కాదని ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు.



క్షమ సావంత్ మహారాష్ట్రలోని పూనాలో ఒక తమిళ కుటుంబంలో జన్మించారు. తల్లి స్కూల్ ప్రిన్సిపల్‌గా పని చేశారు. ఇంజనీర్ అయిన తండ్రి క్షమ పదమూడేళ్ల వయస్సులో ఒక ప్రమాదంలో మరణించారు. ఆమె ముంబైలో చదువుకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీరయ్యారు. 1996లో అమెరికా వెళ్లిన తరువాత అర్థశాస్త్రంలో పిహెచ్‌డి చేసి కొంతకాలం ప్రొఫెసర్‌గా పని చేశారు. అక్కడే ఆమె 2006లో వామపక్ష రాజకీయాల్లో అడుగుపెట్టారు. అంతకు ముందు ఆమెకు రాజకీయాలతో సంబంధం లేదు. 2012లో వాషింగ్టన్ ప్రజా ప్రతినిధుల సభకు పోటీ చేసి ఓడిపోయారు. తరువాత సియాటిల్ నగర పాలక సంస్థ ఎన్నికల్లో గెలిచి 2014 నుంచి 2024 వరకు ప్రాతినిధ్యం వహించారు. ఆ సమయంలో కుల వివక్ష వ్యతిరేక తీర్మానం చేయించటంలో కీలక పాత్ర పోషించటాన్ని హిందూ సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. వీసా తిరస్కరణ వెనుక ఈ అంశం ఉందా అన్న ప్రశ్నకు ఇంతకు మించి బిజెపి ప్రభుత్వ రాజకీయ నిర్ణయం వెనుక మరొక కారణం కనిపించటం లేదన్నారు. "నేను ఒక సోషలిస్టును. పదేళ్ల పాటు కార్మికవర్గ ప్రతినిధిగా సియాటిల్ కౌన్సిల్‌లో ఉన్నాను. ఆ సమయంలో నేను ప్రజా ఉద్యమ నిర్మాణానికి, కనీస వేతనం గంటకు 15 డాలర్లకు పెంచాలని కోరుతూ నా పదవిని వినియోగించాను. ఇప్పుడది 20.76 డాలర్లకు పెరిగింది. అమెరికాలో ఇది గరిష్టం. పేదల గృహ నిర్మాణాలకు కార్పొరేట్ సంస్థలు వాటా చెల్లించాలని కూడా నేను పని చేశాను. 2020 ఫిబ్రవరిలో సిఎఎ, ఎన్.ఆర్.సి చట్టాలను ఖండిస్తూ సియాటిల్ కౌన్సిల్‌లో పెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ కార్యాలయం నాకు ఒక లేఖ పంపింది. అమెరికాలోని హిందూత్వ శక్తులు, మోడీ మద్దతుదార్ల నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాం. 2023 ఫిబ్రవరిలో కుల వివక్షపై చారిత్రాత్మక నిషేధాన్ని ప్రకటించటంలో విజయం సాధించాం. మాకు విశ్వహిందూ పరిషత్ నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లడైంది. మితవాద హిందూ అమెరికన్ ఫౌండేషన్, ఉత్తర అమెరికా హిందువుల సంఘటన మాకు వ్యతిరేకంగా పని చేశాయి. అందువలన మోడీ ప్రభుత్వం, అమెరికాలోని దాని మద్దతుదార్లు మాకు వ్యతిరేకంగా ఉన్నారనటంలో ఎలాంటి సందేహం లేదు. వారందరికీ నా రాజకీయ అభిప్రాయాలు ఏమిటో తెలుసు. అనారోగ్యంతో ఉన్న తల్లిని చూసేందుకు అనుమతించక పోవటం అమానుషం. ఏ రకమైన ప్రభుత్వమిది. నా వీసా తిరస్కరణ వెనుక రాజకీయ కారణాలు లేవని మోడీ సర్కార్ చెప్పుకోవాలంటే వీసా మంజూరు చేసి నిరూపించుకోవచ్చు"ని క్షమ పేర్కొన్నారు.

> **2020 ఫిబ్రవరిలో సిఎఎ, ఎన్.ఆర్.సి చట్టాలను ఖండిస్తూ సియాటిల్ కౌన్సిల్‌లో పెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ శాన్ ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ కార్యాలయం నాకు ఒక లేఖ పంపింది. అమెరికాలోని హిందూత్వ శక్తులు, మోడీ మద్దతుదార్ల నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాం. 2023 ఫిబ్రవరిలో కుల వివక్షపై చారిత్రాత్మక నిషేధాన్ని ప్రకటించటంలో విజయం సాధించాం. మాకు విశ్వహిందూ పరిషత్ నుంచి తీవ్ర వ్యతిరేకత వెల్లడైంది. మితవాద హిందూ అమెరికన్ ఫౌండేషన్, ఉత్తర అమెరికా హిందువుల సంఘటన మాకు వ్యతిరేకంగా పని చేశాయి. అందువలన మోడీ ప్రభుత్వం, అమెరికాలోని దాని మద్దతుదార్లు మాకు వ్యతిరేకంగా ఉన్నారనటంలో ఎలాంటి సందేహం లేదు**

అమెరికాకు వెళ్లిన వారందరూ అని కాదు గానీ ఎక్కువ మంది తమతో పాటు కులతత్వాన్ని, కుల వివక్షను కూడా తీసుకుపోయారు. ఈ మధ్య దానికి మతాన్ని కూడా తోడు చేశారు. మన దేశంలో మత ప్రాతిపదిక మీద పని చేసే సంస్థలన్నింటికీ అమెరికా శాఖలు ఉన్నాయి. దక్షిణాసియా నుంచి వచ్చిన దళితులు, ఇతర అణచివేతకు గురైన కులాల వారు అమెరికాలో కూడా దాన్ని తప్పించుకోలేకపోతున్నారు. కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ అనే సంస్థ జరిపిన అధ్యయనం ప్రకారం విద్యాపరంగా మూడింట ఒక వంతు, పని స్థలాల్లో , మూడింట రెండు వంతుల మంది వివక్షను ఎదుర్కొన్నట్లు తేలింది. తక్కువగా చూడటం, సూటిపోటి మాటలు, లైంగిక వేధింపుల గురించి 30 మంది దళిత మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తమ అనుభవాలను బహిరంగ లేఖ రూపంలో వెల్లడించారు. సిస్కో సిస్టమ్స్ కంపెనీలో అగ్రవర్ణాలుగా భావించబడుతున్నవారు తనకు రావాల్సిన ఉద్యోగోన్నతి, వేతన పెంపుదలను ఎలా అడ్డుకుంటున్నారో వెల్లడిస్తూ దాఖలు చేసిన కేసును ఒక దళిత సామాజిక తరగతికి చెందిన ఇంజనీరు గెలిచారు. ఆ తరువాత వందలాది మంది తాము ఎదుర్కొన్న వివక్ష గురించి గళం విప్పారు. ఈ పూర్వరంగంలోనే క్షమ సావంత్ సియాటిల్ సిటీ కౌన్సిలర్‌గా వివక్షకు వ్యతిరేకంగా ఒక తీర్మానాన్ని ప్రతిపాదించి ఆమోదింప చేయించారు.

క్షమా సావంత్ అలుపెరగని పోరాట యోధురాలు. కార్మిక వర్గాన్ని దోచుకుంటున్న ధనికులు, వారికి మద్దతు ఇస్తున్న అధికార రిపబ్లిక్, ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా మరొక పార్టీ నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందని ఆమె గతంలో ప్రకటించారు. దళితుల సమస్యల మీద ఆ సామాజిక తరగతికి చెందిన వారు మాత్రమే సక్రమంగా స్పందించగలరని, వారు మాత్రమే పోరాటాలకు నాయకత్వం వహించాలని చెబుతున్న వారు క్షమ పోరాటం, ఆమె ఎదుర్కొంటున్న వేధింపులను చూసిన తరువాత తమ సంకుచిత వైఖరిని మార్చుకోవాలని సూచించటం తప్పు కాదేమో!

కవిత్వం

ఇంకెన్నాళ్ళీ వెనక్కి...

కులమా! నీవెవరు..
అధర్మానివా నరకానివా రాక్షసత్వానివా
ఈ జాతి మూలాలలో వేరుపురుగై
కొరికి కూల్చేస్తున్నావు
పచ్చటి నేలలో అచ్చమైన విషవృక్షానివై
కులాల ఫలాలు కాస్తున్నావు
దరిద్రుణ్ణి దళితుణ్ణి చేసి ఊరికి దూరం చేసి
వెట్టిచాకిరికి అట్టిపెట్టుకుంటున్నావు
చతుర్వేదాల్లోంచి నెట్టేసి చాతుర్యంగా
పంచముడని ఎంచి మరీ
అమాయకుల్ని అసహాయుల్ని చేసి
బలిచేసి జాతిని నిర్వీర్యం చేసి
నీతిని తారుమారు చేసి నిస్సిగ్గుగా
నవ్వుతున్నావు
తలకిందులుగా తపస్సు చేస్తేగానీ
గబ్బిళానికి గండపెండేరం తొడగలేదు!
అసలు నీవెవరు ఇంకెన్నాళ్ళీ దళిత హననం?
అవమానించావు అవయవాలు నరికావు
ఇంకేం చేస్తావ్ ఏం మిగిలుంది..
బొటనవేలు దగ్గర్నుండి భవితంతా
పరిహారంగా కట్టించుకున్నా
ఇంకా కుతకుతమంటుందా కులవివక్ష!
కాలమెంత దూసుకుపోతున్నా
గేలమేసి లాగుతుందా వదలని
వెనకబాటుతనం!
(తమిళనాడులో దళిత యువకుడి
చేతులు నరికిన దారుణం చదివి)

- భీమవరపు పురుషోత్తమ్,
రాజమహేంద్రవరం,
సెల్ : 9949800253

చితికిపోతున్న చేనేత

అమలుకు నోచుకోని ఎన్నికల హామీ • ముడిసరుకు ధరకు రెక్కలు
జిఎస్‌టితో అదనపు భారం • పెట్టుబడులు పెట్టలేని మాస్టర్ వీవర్లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ విధానాలు, పెరుగుతున్న ధరలతో నేతన్నలు చితికిపోతున్నారు. చేనేతలకు కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. చేనేత కార్మికులకు 500 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇస్తాం అంటూ ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా టిడిపి అధినేత చేసిన వాగ్దానాలు నీటిపై రాతలుగా మారాయి. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదు. మరో వైపు సర్‌ఛార్జీల పేరుతో అదనపు బాదుడుకు తెరలేపటంతో చేనేత కార్మికుల పరిస్థితి గోరుచుట్టుపై రోకలి పోటులా మారింది. ఇప్పటికే పట్టుపై పెంచిన ధరలు ప్రభావం చేనేత కార్మికులు, అనుబంధ వత్తుల కార్మికులకు భారంగా మారాయి. వారిని కష్టాల్లో పడేసినట్టు అయ్యింది. సొంత మగ్గం దారులు, మాస్టర్ వీవర్లు, వారి ద్వార మగ్గం నేసేవారు వారికి అనుబంధంగా పడుగులు పట్టేవారు, నూలు తోడేవారు, జరీలు చేసేవారు, అచ్చులు అతికేవారి ఇలా పలురకాల ఉపవృత్తులతో చేనేత కార్మికులు ఉన్నారు. నూలు, జరీ, పట్టు, పాగళ్ల (ముడిసరుకు)కు పెరిగిన ధరలకు తోడు పవర్‌లూమ్‌తో తక్కువకాలంలో ఎక్కువ ఉత్పత్తులు తయారవుతాయి. అదే పనిని చేనేత కార్మికులు ఒక బారు (5 చీరలు, 5 జాకెట్లు) 5 నుంచి 10 రోజుల వ్యవధితో తయారు చేస్తే పవర్లూమ్‌తో మరమగ్గాలు, ఎయిర్ జెట్ మగ్గాలతో 2రోజుల్లోనే తయారు చేస్తుంది. మరోవైపు మగ్గాలపై నేసే పట్టు చీర రూ.12వేలు ధర పలికితే తప్ప తయారీదారులకు గిట్టుబాటు కాదు. అదే పవర్‌లూమ్ ఉత్పత్తులతో వచ్చే చీర మాత్రం రూ.8-9 వేలకు మార్కెట్లో లభ్యమవుతోంది. ఈ పరిస్థితుల్లో చేనేత రంగం కుదేలవుతోందని నేతన్నలు, మాస్టర్ వీవర్లు వాపోతున్నారు. దీంతో మాస్టర్ వీవర్లకు గిట్టుబాటు కాక చేనేత కార్మికులు, ఉపవృత్తుల వారికి కూలి తగ్గించే పరిస్థితికి దారితీసింది. ఆర్థిక ఊబిలో కూరుకుపోతుండటంతో చేనేత, ఉపవత్తుల కార్మికులు మగ్గం పనులు వదిలి ఇతర పనులకు కూలీలుగా వెళ్తున్నారు. మరోవైపు ముడిసరుకు కొనుగోలుపైనా 5 నుంచి 12 శాతం జిఎస్‌టి విధింపుపైనా చేనేతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చేనేత కార్మికులతో పాటు ఉపవృత్తుల కార్మికులు అందరూ కలిపి మొత్తం 25,000 మంది ఉన్నట్లు అంచనా. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ హయాంలో జనతా వస్త్రాల పేరుతో ప్రభుత్వ శాఖలకు, పాఠశాలలకు చేనేత వస్త్రాలు పంపిణీ చేసి చేనేత రంగం అభివృద్ధికి కృషి చేశారు. ఆ తరహాలో ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తే చేనేత రంగానికి పూర్వవైభవంతోపాటు చేనేత కార్మిక కుటుంబాలు అభివృద్ధికి నోచుకుంటాయని నేత కార్మికులు, ఆయా సంఘాల నాయకులు కోరుతున్నారు.

చేనేత కార్మికుల సమస్యలు, డిమాండ్లు

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయాలి. నేతన్న నేస్తం పథకాన్ని కొనసాగించాలి. చేనేత ఉత్పత్తులకు జిఎస్‌టి మినహాయించాలి. నూలు సిల్కులకు 50 శాతం రాయితీ ఇవ్వాలి. చేనేత కుటుంబాలకు రూ.5లక్షల వరకు వడ్డీ లేని రుణాలివ్వాలి. గృహం, వర్క్‌షెడ్ పథకాన్ని అమలు చేయాలి. చేనేత రంగం అభివృద్ధికి పట్టు, జరి, నూలును సబ్సిడీ ధరకు అందించాలి. సొసైటీల ద్వారా సబ్సిడీ రుణాలు కల్పించాలి.

'కార్గో మార్క్స్' డ్రోన్ ఆవిష్కరణ

- భారీ విస్తరణపై మాజిక్లానిక్ క్లౌడ్ దృష్టి
- విదేశీ వ్యాపారాలపై కన్ను
- ఆ సంస్థ గ్లోబల్ సిఇఒ జోసెఫ్ సుధీర్ తుమ్మ

ప్రజాశక్తి - హైదరాబాద్

టెక్నాలజీ కంపెనీ మాజిక్లానిక్ క్లౌడ్ లిమిటెడ్ ఇ-స్పోర్ట్స్, స్మార్ట్‌క్లౌడ్, ఎడ్యుటెక్, డిఫెన్స్ సొల్యూషన్స్ సహా డ్రోన్ టెక్నాలజీలో భారీ విస్తరణపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలిపింది. ఇందుకోసం దీర్ఘకాలిక వృద్ధి కోసం ఎలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలని నిర్దేశించుకున్నట్లు వెల్లడించింది. కొత్తగా దేశీయంగా 2008లోనే సరుకును మోసుకెళ్లగలిగే కార్గో డ్రోన్‌ను ఆవిష్కరించినట్లు మాజిక్లానిక్ క్లౌడ్ లిమిటెడ్ ఎండి, గ్లోబల్ సిఇఒ జోసెఫ్ సుధీర్ తుమ్మ తెలిపారు. తమ స్కైడ్రోన్ కంపెనీ ఈ అత్యంత శక్తివంతమైన కార్గోమార్క్స్ 200 కెపాసిటీని సైన్యం అవసరాలకు కూడా తీర్చిదిద్దింది. ఇప్పటికే భారత సైన్యంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుధీర్ తుమ్మ మాట్లాడుతూ.. ముఖ్యంగా ఎఐ ఆధారిత ఉత్పత్తులపై ప్రధాన దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. అధునాతన డ్రోన్ టెక్నాలజీలో అగ్రగామిగా తన స్థానాన్ని పటిష్టం చేసుకోవడంతో పాటుగా అమెరికా, యూరప్, ఆసియా మార్కెట్లకు కార్యకలాపాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వచ్చే కొద్ది నెలల్లో రూ.200 కోట్లతో కొత్త కంపెనీని స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉన్నామన్నారు. 2025-26కు గాను స్వాధీనాల కోసం రూ.400-500 కోట్ల నిధులు వ్యయం చేయనున్నామన్నారు. ప్రస్తుతం తమ గ్రూపులోని ఐదు సంస్థల్లో 1600 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని అన్నారు.

2027 నాటికి సిబ్బంది సంఖ్యను 5వేల సంఖ్యకు చేర్చాలని నిర్దేశించుకున్నామన్నారు. ఆ సంస్థ సిఎఫ్ఒ సంజయ్ చౌహాన్ మాట్లాడుతూ.. 2024 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 15 శాతం వృద్ధితో రూ.151 కోట్ల రెవెన్యూ.. 30 శాతం వృద్ధితో రూ.29.2 కోట్ల నికర లాభాలను సాధించామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26లో రెవెన్యూలో 50 శాతం వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఏరియల్ లాజిస్టిక్స్ సంబంధించి డ్రోన్ రంగంలో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకుంటామని స్కైడ్రోన్ సిఇఒ అర్జున్ నాయక్ తెలిపారు.

త్వరలో పుతిన్‌తో భేటీ : ట్రంప్

వాషింగ్టన్ : త్వరలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అవుతానని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కొన్ని రోజుల్లో అమెరికా-రష్యా మధ్య సౌదీ అరేబియాలో ఉక్రెయిన్ శాంతి చర్చలు జరగనున్నాయి. అయితే ఉక్రెయిన్ లేకుండానే ఈ చర్చలు చేపడుతున్నారంటూ వస్తున్న విమర్శలపై ట్రంప్ స్పందించారు. యుద్ధాన్ని ముగించే ఏ చర్చల్లోనైనా జెలెన్‌స్కీ భాగస్వామి అవుతారని ట్రంప్ వివరణ ఇచ్చారు. అంతేకాదు.. చాలా తొందరలో రష్యా అధినేతతో తాను భేటీ కానున్నట్లు చెప్పారు. ఆయన ఫ్లోరిడాలోని డెటోనా రేసులో పాల్గొన్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. "కచ్చితమైన సమయం అనుకోలేదు.. కానీ, తొందర్లోనే జరుగుతుంది" అని విలేకర్లతో పేర్కొన్నారు. మరోవైపు అమెరికా-రష్యా చర్చలకు దూరంగా ఉన్న బ్రిటన్ భిన్నమైన ప్రకటన చేసింది. ఆ దేశ ప్రధాని స్టార్మర్ మాట్లాడుతూ అవసరమైతే ఉక్రెయిన్‌లో తమ సేనలు బరిలోకి దిగుతాయని అన్నారు. ఐరోపా దేశాల అత్యవసర సమావేశానికి ముందు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇది ఉక్రెయిన్ భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న మాత్రమే కాదు. ఐరోపా ఉనికికి కీలకమైంది. సుదీర్ఘకాలం కాలం పాటు ఉక్రెయిన్‌లో శాంతి, సురక్షితను కాపాడటం చాలా ముఖ్యం" అని పేర్కొన్నారు. మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే శాంతిచర్చల దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన చర్యలు ఆందోళన రేపుతోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇప్పటికే ఆయన ఫోన్లో మాట్లాడారు. ఉక్రెయిన్‌కు అమెరికా సాయం నిలిపివేయడం వల్ల తలెత్తే పరిణామాలపైనా ఇప్పుడు యూరోప్ దేశాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. యుద్ధ విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత తమ భద్రతకు ముప్పు తలెత్తవచ్చున్న ఆందోళన ఐరోపా దేశాల్లో ఉంది. రష్యా కన్ను తమపై పడే అవకాశం ఉందని అవి భావిస్తున్నాయి. చర్చలపై ట్రంప్ దృష్టిసారించగా ఇయు దేశాలు సోమవారం పారిస్‌లో అత్యవసరంగా సమావేశం కాబోతున్నాయి.

మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం యుఎఇకి చేరుకొన్నారు. భారీ మానవీయ సహాయ కార్యక్రమం నిమిత్తం తాను ఇక్కడికి వచ్చినట్లు ఆయన వెల్లడించారు. రష్యాతో చర్చల కోసం సౌదీ అరేబియాకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, పశ్చిమాసియా ప్రతినిధి స్టీవ్ విట్‌కోఫ్, జాతీయ భద్రతా సలహాదారు మైక్‌వాల్జ్ కూడా రియాద్‌కు ప్రయాణమయ్యారు. ఈసందర్భంగా రియాద్‌లోని కొందరు అధికారులు మాట్లాడుతూ ఈ చర్చలకు వేదిక కావడంతోపాటు.. మధ్యవర్తిత్వంలోను తమ దేశం కీలకపాత్ర పోషించనుందన్నారు.

జిబిఎస్‌పై ఆందోళన చెందొద్దు : రాష్ట్ర మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - ఏలూరు

జిబిఎస్ వ్యాధి పట్ల ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఈ వ్యాధిపై ప్రజల్లో అపోహలు తొలగించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్డియాలజీ, న్యూరాలజీ జనరల్ మెడిసిన్ విభాగాల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిబిఎస్ వ్యాధి గురించి వివిధ జిల్లాల్లో వార్తలు వస్తున్న నేపథ్యంలో దానికి అత్యవసరమైన ఇమ్యూనోగ్లోబ్యులిన్ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచాలన్నారు. జిబిఎస్ రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించాలన్నారు. చికిత్స తీసుకోకుండానే చాలావరకు ఈ వ్యాధి తగ్గుతుందన్నారు. జిబిఎస్ వ్యాధి కాళ్లు వద్ద ప్రారంభమై పైవరకు వ్యాపిస్తుందన్నారు. పరిశుభ్రత విషయంలో ప్రజలు జాగత్తగా ఉండాలని మంత్రి సూచించారు. తిమ్మిర్లు, నడవలేని స్థితిలో ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి రావాలన్నారు. సుగర్ రోగులకు అవసరమైన ఇన్సులిన్ ఇంజక్షన్, హీమోఫిలియా రోగులకు అవసరమైన ఫ్యాక్టర్ ఇంజక్షన్ కూడా అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులో పెట్టుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.



మీ కోసం

వంకాయలు ఉడుకుతున్నప్పుడు కొద్దిగా పసుపు, పాలు పోస్తే కూర కసరెక్కదు.

జీవన సౌరభం

విజయం కలిగిందని విర్రవీగకూడదు. అపజయం కలిగిందని నిరాశపడకూడదు. విజయం అంతం కాదు. అపజయం చివరిమెట్టూ కాదు.

చిన్నారులం



గీతల్నే మార్చేస్తాం దారుల్లా,
రాతల్నే రాసేస్తాం మేధావుల్లా,
గీతలతో రాతలతో మా బాటలే,
వేసేస్తాం భవిష్యత్తుకు రహదారులే..

లెక్కల్లో మెలకువలే నేర్చేస్తాం,
హక్కుల్లో మా హక్కులు సాధిస్తాం,
లెక్కలతో హక్కులతో మా పునాదులే,
కట్టేస్తాం ఆశలతో మహా కోటలే..

అమ్మ చెప్పిన మాట వింటాం,
నాన్నా నేర్పిన నడత నేర్చుకుంటాం,
అమ్మకు నాన్నకు మంచి పేరు తెస్తాం
మా గుర్తింపుతో గౌరవం
పెంచేస్తాం..

చిన్నారులం మేం చిన్నారులం
మా రాజ్యానికి మేమే రాజులం...


ఆటలు ఆడేస్తాం ఏంచక్కా,
పాటలు పాడేస్తాం పొందుగ్గా,
ఆటలలో పాటలలో సయ్యాటలే,
మేమెంతో మాకెంతో సందడులే..

గురువులు నేర్పిన చదువు
నేర్చుకుంటాం,
పెద్దలు చెప్పిన మంచి మాట వింటాం,
గురువులకు పెద్దలకు ఘన కీర్తి తెస్తాం,
వారి దీవెనలతో ఎన్నెన్నో సాధిస్తాం..

ఇమంది అశోక్ కుమార్,
ఎస్జీటీ,
93928 69899.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.



నేను గీసిన బొమ్మ





ఉప్పాడ లిఖిత
5వ తరగతి
హరిగోపాల్ స్కూలు
రైల్వే న్యూ కాలనీ, విశాఖపట్నం


పరీక్షల వేళ.. ప్రశాంతత కావాలి..



ప్రస్తుతం పిల్లలకు పరీక్షల వాతావరణం మొదలైంది. ఈ కాలంలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతారు. ఏది ఎలా చదవాలో తెలియక సరిగ్గా నిద్రపోరు. సమయానికి తినరు. కొన్ని సూచనలు పాటించడం ద్వారా పిల్లలను ప్రశాంతంగా ఉంచి, పరీక్షలకు సన్నద్ధం చేయాలి.

- ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలి. అంటే విపరీతమైన ఆత్రుత, కోపం ప్రదర్శించడం, భయపెట్టడం వంటివి పిల్లల ముందు చేయకూడదు. అలా చేస్తే పిల్లల జ్ఞాపకశక్తి తగ్గుతుంది.
- పిల్లలు ముఖ్యమైన పాఠాలను ఉదయం వేళలో చదవాలి. అప్పుడు మెదడు ప్రశాంతంగా ఉండి చదివింది అర్థమవుతుంది. గుర్తుండిపోతుంది.
- కష్టమైన సూత్రాలను, ఫార్ములాలను పేపర్ మీద పదే పదే రాసుకోవాలి. దాంతో బట్టీకొట్టే పద్ధతి తగ్గి పాఠాలను అర్థం చేసుకోవడం పెరుగుతుంది.
- పరీక్షల్లో వచ్చే ప్రశ్నలు ఏ రకమైనవి అడుగుతారో ముందుగా తయారుచేసి పెట్టుకోవాలి. చిన్నవి, పెద్దవి, మార్కుల వారీగా బేరీజు వేసుకుని చదవడం మొదలుపెడితే సిలబస్ సులభంగా పూర్తవుతుంది.
- ఎంత ఒత్తిడి ఉన్నా, రోజుకు కనీసం ఏడు గంటలు నిద్రపోవాలి. అయితే మధ్యాహ్నం నిద్రపోవడం మంచిది కాదు. ఎక్కువగా మేల్కొని చదివినా జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది.
- ప్రతిరోజూ అన్ని సబ్జెక్టులను చదువుకునేలా ప్రణాళిక వేసుకోవాలి. ముందు సులభంగా అర్థమయ్యే పాఠాలను చదువుకోవాలి. ఆ తర్వాత కష్టంగా ఉండే పాఠాలను చదవాలి.
- విద్యార్థులు తమ షెడ్యూల్ ప్రకారం అన్ని సబ్జెక్ట్‌లకు సమానమైన సమయం కేటాయించాలి. ఇష్టమైనదని ఎక్కువ సేపు, రాదని తక్కువ సమయం చదవకూడదు. వాయిదా వేయకూడదు.
- కఠినంగా ఉన్న అంశాలను పాయింట్ల రూపంలో రాసుకుని చదవడం మంచిది.
- ఒత్తిడిని అధిగమించడానికి కాసేపు చదువును పక్కనబెట్టి ఆటలు ఆడాలి. సమతుల్య ఆహారం తీసుకోవాలి.
- ఎంత చదివినా గుర్తుండవు అనుకునే పాఠాలను స్నేహితులతో గానీ, కుటుంబసభ్యులతో చర్చిస్తూ చెప్పాలి. లేదా బోర్డు మీద రాస్తూ చదవాలి.
- చదివే క్రమంలో పాఠాల్లో అనుమానాలు వస్తే టీచర్లను వెంటనే అడగాలి.
- పాఠ్య పుస్తకాల్లో ఉన్నవే పరీక్షల్లో ప్రశ్నలుగా వస్తాయి. సామాన్య విద్యార్థులకు తగ్గట్టుగానే ప్రశ్నాపత్రం రూపొందుతుంది. ఉన్న సమయాన్ని ప్రశాంతంగా, ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవాలి.
- టెక్స్ట్ బుక్స్ పాఠాలను చదవడం వల్ల ప్రశ్నలు ఎక్కడి నుండి అడిగినా రాయగలుగుతారు. కాబట్టి టెక్స్ట్ బుక్ రీడింగ్ తప్పనిసరిగా చేసుకోవాలి.
- పెద్ద పెద్ద ప్రశ్నలు, వ్యాసాలు రాయడం కష్టంగా అనిపించినప్పుడు చిన్న చిన్న భాగాలుగా చేసుకుని చదువుకోవాలి. బట్టీ పట్టడం మాని, అర్థం చేసుకుంటూ చదివితే పాఠ్యాంశం సులభంగా అర్థమవుతుంది.
- చదవడం అంటే ఎప్పుడూ పుస్తకాలు ముందేసుకుని కూర్చోవడం కాదు.. ఎంత శ్రద్ధగా చదివామన్నదే ముఖ్యం. కాబట్టి సమయం వృధా చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా చదివితే ఈ పరీక్షల కాలం సులభంగా దాటేయచ్చు.

చుండ్రు ఇలా వదిలించుకుందాం..



జుట్టు రాలడానికి ప్రధాన సమస్య చుండ్రు. శరీరంలో హార్మోన్లు హెచ్చుతగ్గులు అయినా, వాడుతున్న నూనెలో సమస్య ఉన్నా, పొడి గాలి, తక్కువ తేమ కారణంగా తలపై చుండ్రు ఎక్కువగా వస్తూ ఉంటుంది. దీన్ని ఎలా నివారించాలో ఇప్పుడు చూద్దాం..

- కప్పు పెరుగు తలకు పెట్టి అరగంట తర్వాత కడిగివేయాలి. వారంలో రెండు, మూడు సార్లు ఇలా చేస్తే చుండ్రు తగ్గిపోతుంది.
- వేప ఆకులను శుభ్రంగా కడిగి, మెత్తగా పేస్ట్ చేసి, తలకు పట్టించాలి. అరగంట తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి.
- ఒక కప్పు కలబంద గుజ్జును తీసుకుని, మెత్తగా మిక్సీ పట్టి తలంతా పట్టించాలి. గంట తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపుతో తలస్నానం చేయాలి.
- రాత్రంతా నానబెట్టిన మెంతి గింజలను పేస్ట్ చేసి దానిలో కొద్దిగా కలబంద గుజ్జు కలపాలి. ఈ మిశ్రమాన్ని తలపై పూసి, గంట తర్వాత షాంపూతో కడగాలి. ఇలా వారానికి ఒకసారి చేయడం వల్ల చుండ్రు తగ్గి జుట్టు నల్లబడుతుంది. బాగా పెరుగుతుంది.
- రెండు రోజులోకసారి తలకి నిమ్మరసం పెడుతూ ఉంటే తల్లో దురద, పుండ్లు ఉన్నా వెంటనే తగ్గుతాయి.
- ఇవన్నీ చేస్తున్నా చుండ్రు తగ్గటం లేదంటే హార్మోన్ల పరీక్ష చేయించుకోవాలి. వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి.
- ప్రతిరోజూ వ్యాయామం చేసినా, తల్లో చెమట పట్టినా వెంటనే జుట్టును శుభ్రం చేసుకోవాలి.
- వీటితో పాటు తలకు పూసే నూనెలో ఔషధాలు ఉండేలా చూసుకోవాలి. తీసుకునే ఆహారంలో పోషక పదార్థాలు, విటమిన్లు ఉండేలా జాగ్రత్త పడాలి.



ఒంటిచేత్తో బావులు తవ్వేస్తోంది..

'సంకల్పం గట్టిగా ఉంటే సాధ్యం కానిది ఏదీ వుండదు' అని నిరూపిస్తోంది 57 ఏళ్ల గౌరి. ఉత్తర కర్నాటకకి చెందిన గౌరి ఇటీవల 45 అడుగుల లోతు గల బావిని తవ్వి వార్తలో నిలిచింది. ఈ ఘనత సాధించడం గౌరికి కొత్త కాదు. అంతకు ముందే ఆమె మూడు బావులను అవలీలగా తవ్వేసింది. ఒక్కత్తే ఈ పనిచేసిందంటే ఆశ్చర్యపోకమానరు. కానీ గౌరి ఇది సాధించింది. అందుకే ఇప్పుడు ఆమె గురించి చెప్పుకుంటున్నాం.

2024 డిసెంబరు 15న బావి తవ్వడం మొదలుపెట్టిన గౌరి ఈ ఫిబ్రవరి 15కి దాన్ని పూర్తిచేసింది. ఇప్పుడు ఆ బావి నీళ్లతో స్నానం చేయాలని ఎదురుచూస్తోంది. రోజుకు 6 నుండి 8 గంటలు బావి తవ్వే పనిలోనే ఉండేదని స్థానికులు ఆమె గురించి గొప్పగా చెబుతున్నారు. నీళ్లు లేక తనకున్న కొద్ది పొలం ఎండిపోతుంటే మొదటిసారి గౌరి తన పొలంలో బావి తవ్వింది. అప్పుడే గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. ఎవరి సాయం లేకుండా ఒక్కత్తే బావి తవ్విందని అప్పట్లో గౌరి పేరు పతాకశీర్షికల్లో కూడా వచ్చింది. ఆ తరువాత గ్రామస్తుల దాహార్తి తీర్చడం కోసం బావి తవ్వినప్పుడు ఆమె సామాజిక కృషికి చుట్టుపక్కల గ్రామాల వారు కూడా కొనియాడారు. ఆ తరువాత 2024 మధ్యలో సిర్సిలోని గణేష్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో బావి తవ్వినప్పుడు ఆమె గురించి రాష్ట్రమంతా తెలిసింది. జిల్లా యంత్రాంగం నుండి వ్యతిరేకత వచ్చినప్పటికీ గౌరి అంగన్వాడీ పిల్లల కోసం, సిబ్బంది కోసం బావి తవ్విందని గ్రామస్తులు ఇప్పటికీ చెప్పుకుంటారు. అప్పుడు ఆమెకి ప్రశంసలు, ఆంక్షలు ఒకేసారి ఎదురయ్యాయి. బావి పనులు తక్షణం ఆపేయమని అధికారులు హుకుం జారీచేయడం, పాలకులు ఆమె కృషికి సన్మానాలు చేయడం గౌరికి అనుభవమయ్యాయి.


ఎన్ని అడ్డంకులు ఎదురైనా గౌరి మాత్రం తను అనుకున్న పని సాధించడంలో మాత్రం ఎప్పుడూ వెనుకడుగువేయలేదు. తాజా ఘటనే అందుకు ఉదాహరణ. 45 అడుగుల బావిని ఒక్కత్తే తవ్వడం మాటలు కాదు. ఇప్పుడు ఆ బావిలో ఉబికి వచ్చిన నీటిని చూసి చిన్నపిల్లలా కేరింతలు కొడుతోంది. ఇది ఆమెకి ప్రత్యేకమైన సందర్భం. తన కోసం తవ్వుకున్న బావి అది. ఆ నీళ్లతో తన ఇంటి అవసరాలు తీర్చుకోవాలని ఎదురుచూస్తోంది.



'1000 వాలా'లో నా పాత్ర అలరిస్తుంది : సుమన్

'నేను ఇప్పటివరకూ చేసిన సినిమాలకు భిన్నంగా '1000 వాలా'లో నా పాత్ర ఉంటుంది. దర్శకుడు షేక్ అఫ్జల్ కొత్తవాడైనా ఎక్కడా కథ విషయంలో రాజీ లేకుండా చాలా చక్కగా పనిచేశాడు. సీనియర్ దర్శకుడు మాదిరిగానే ఆర్టిస్టులకు క్యారక్టరైజేషన్ చేశారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. నాతోపాటుగా సీనియర్ నటులు ముఖ్తార్‌ఖాన్, పిల్లా ప్రసాద్ కూడా పోటీపడి నటించారు. క్లాస్, మాస్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకునే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయని నేను నమ్ముతున్నా. అందరూ థియేటర్లలో ఈ సినిమాను చూసి బాగా ఆనందించాలని కోరుతున్నా' అని సీనియర్ నటుడు సుమన్ అన్నారు. సూపర్‌హిట్ మూవీ మేకర్స్ పతాకంపై షారుఖ్ నిర్మాణంలో అమిత్ కథానాయకుడిగా నూతన పరిచయంతో తెరకెక్కిన చిత్రం '1000 వాలా'. షారుఖ్, నవిత, కీర్తి, సుమన్, పిల్లా ప్రసాద్, ముఖ్తార్ ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ ఏర్పాటుచేసిన సమావేశంలో సుమన్ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి జెవి మోహన్‌గౌడ్ మాట్లాడుతూ చాలా చక్కటి కథతో తెరకెక్కిన '1000 వాలా' సినిమాను అందరూ ఆదరించాలని కోరారు. దర్శకుడు అఫ్జల్ మాట్లాడుతూ 'తాను రూపొందించిన '10 రూపీస్' చిత్రం మంచి విజయాన్ని సాధించిందన్నారు. '1000 వాలా'ను మంచి కథతో సరికొత్తగా తెరకెక్కించామన్నారు. త్వరలోనే విడుదల చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రచయిత గౌస్ ఖాజా ఖాజా, కూర్పు రవితేజ జి, పాటలు సందీప్ వేపూరి, కొరియోగ్రఫీ బాలు, సూర్య, కెమెరా: చందు యేజే, సంగీతం: వంశీకాంత్ రేఖాన.

కోకాపేటలో 'విశ్వంభర'



కథానాయకుడు చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని కోకాపేటలో జరుగుతోంది. ఎఎస్ ప్రకాష్ వేసిన ప్రత్యేక సెట్‌లో డ్యాన్స్‌మాస్టర్ శోభి మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ పాటను సోమవారంనాడు తెరకెక్కించారు. సోషియో ఫాంటసీగా ఈ సినిమా తెరకెక్కుతోంది. సాంకేతికంగా గ్రాఫిక్స్ పనులు ఆలస్యం కావటంతో సినిమా విడుదలను వాయిదా వేశామని నిర్మాణ సంస్థ యువీ క్రియేషన్స్ గతంలోనే ప్రకటించింది. రామజోగయ్య రాసిన 'రామ రామ జయరామ' అనే పాటను ఇందులో కొత్తగా చేర్చుతున్నట్లుగా సమాచారం. ఈ పాటను తెరకెక్కించటానికి ప్రత్యేకమైన సెట్లు సైతం ఏర్పాటుచేశారు.

శివకార్తికేయన్ 'మదరాసి'



శివకార్తికేయన్ పుట్టిన రోజు సందర్భంగా కొత్త సినిమా 'మదరాసి' టైటిల్‌తోపాటుగా గ్లింప్స్‌ను మేకర్లు విడుదల చేశారు. మావీరన్, అయలాన్, అమరన్ చిత్రాలతో ఆయన వరుస విజయాలను అందుకున్నారు. ఆయన కెరీర్‌లో 23వ చిత్రాన్ని ఎఆర్ మురుగదాస్ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీసు అధికారిగా నటిస్తున్నారు. కథానాయిక రుక్మిణి వసంత్. అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. శ్రీ లక్ష్మీమూవీస్ బ్యానర్‌పై శ్రీలక్ష్మి ప్రసాద్, సుందర్‌రాజా నిర్మిస్తున్నారు. రాబోయే వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది.

'వందేమాతరం' సినిమా షూటింగ్ పూర్తి



రత్నమ్స్ ఫిలిం క్రియేషన్ ప్రొడక్షన్ నం.2 బ్యానర్‌లో వస్తున్న చిత్రం 'వందేమాతరం'. గతకొన్ని రోజులుగా రెగ్యులర్ షూటింగ్ జరుపుకున్న ఈ సినిమా తుది షెడ్యూల్ కూడా పూర్తయ్యింది. త్వరలోనే పోస్ట్‌ప్రొడక్షన్ పనులు పూర్తికాగానే చిత్రాన్ని విడుదల చేస్తామని దర్శకుడు బి.వి.రత్నం తెలిపారు. ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా నటభూషణ్ శోభన్‌బాబు మేనల్లుడు శోభన్ రాజా ప్రధాన పాత్రలో నటించారు. నేవీ సూర్యభాయ్ వాచస్పతి, జయరాజు తదితరులు నటించారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం బి.వి.రత్నం, నిర్మాత జంగం కిరణ్‌బాబు, కెమెరామెన్ బి.నాగేంద్రబాబు, సంగీతం రాజ్‌కిరణ్.



నా రెమ్యునరేషన్‌తోనే

సూర్య, కుటుంబ ఆధ్వర్యంలో నడుస్తున్న అగరం ఫౌండేషన్ నూతన కార్యాలయాన్ని సూర్య కుటుంబసభ్యుల సమక్షంలో నూతనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూర్య తండ్రి శివకుమార్, కార్తీ, ఆయన భార్య, సోదరి బృందా, జ్యోతికతో పాటు వారి పిల్లలు పాల్గొన్నారు. అగరం ఫౌండేషన్ అనేది సూర్య నేతృత్వంలోని ఎడ్యుకేషనల్ ఫౌండేషన్. గత 20 సంవత్సరాలుగా, అతని కుటుంబ సభ్యులు అట్టడుగు ఆర్థిక వర్గాల విద్యార్థులకు విద్యనందిస్తున్నారు. తమిళంలో అగరం అంటే 'అ'కారం... అంటే తొలి అక్షరం అని సూర్య తెలిపారు. బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించి తమ సొంత డబ్బుతో నిర్మించామని సూర్య ఈ కార్యక్రమంలో చెప్పారు. 'సుమారు 20 ఏళ్ల పాటు కష్టానికి ప్రతిఫలం ఈ భవనం' అని అన్నారు. 'పిల్లల విద్య కోసం తమ సంస్థకు వచ్చిన విరాళాల నుంచి ఒక్క రూపాయి కూడా బిల్డింగ్ నిర్మాణం కోసం ఉపయోగించలేదు.

సినిమాల నుంచి తమకు వచ్చిన రెమ్యునరేషన్‌లో కొంత మొత్తాన్ని దాచిపెట్టి నిర్మించాం. ప్రస్తుతం ఏడాదికి 700-800 మందికి మాత్రమే సహాయం చేయగలుగుతున్నాం. భవిష్యత్‌లో ఈ సంఖ్యను పెంచేందుకే ఈ భవన నిర్మాణం చేశామ'ని సూర్య ఈ కార్యక్రమంలో మాట్లాడారు.

బెంగళూరు సునాయాసంగా..

- మెరిసిన మంధాన
- బౌలింగ్‌లో రేణుక, వారేహామ్
- ఢిల్లీపై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు



స్మృతి మంధాన (81 పరుగులు)

వడోధర: మహిళల ప్రిమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో గుజరాత్‌పై నెగ్గిన బెంగళూరు.. సోమవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 19.3ఓవర్లలో 141పరుగులకు ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని స్మృతి మంధాన సారథ్యంలోని బెంగళూరు జట్టు 16.2ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ మంధాన (81; 47బంతుల్లో 10ఫోర్లు, 3సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగింది.

అంతకుముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లు రేణుకా సింగ్, వారేహామ్‌కి తోడు కిమ్ గార్త్, ఏక్తా బిస్ట్ కట్టడిగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీ జట్టు 141పరుగులకే పరిమితం చేశారు. టాస్ గెలిచిన బెంగళూరు కెప్టెన్ స్మృతి మంధాన తొలుత బౌలింగ్‌కే మొగ్గు చూపింది. కెప్టెన్ నమ్మకాన్ని బెంగళూరు బౌలర్లు వమ్ము చేయలేదు. రేణుకా సింగ్ ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఫామ్‌లో ఉన్న షఫాలీ వర్మను ఔట్ చేసి ఢిల్లీకి షాకిచ్చింది. ఆ తర్వాత కెప్టెన్ లానింగ్, రోడ్రిగ్స్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కానీ లానింగ్(17), రోడ్రిగ్స్ ఔటయ్యాక ఢిల్లీ వికెట్ల పతనం మొదలైంది. రేణుక(3/23), వారేహామ్(3/25), గార్త్(2/19), ఏక్తా(2/35) సమిష్టిగా చెలరేగారు. ఢిల్లీ ఓపెనర్, కెప్టెన్ లానింగ్(17), షెఫాలీ వర్మ(0) తక్కువ పరుగులకే పెవీలియన్‌కు చేరారు. ఢిల్లీ బ్యాటర్లలో జెమిమా రోడ్రిగ్స్(22 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34) టాప్ స్కోరర్‌గా నిలవగా.. సారా బ్రైస్(23), అన్నాబెల్ సదర్లాండ్(19) రాణించారు. సథర్లాండ్(19), కాప్(12), జొన్నాసెన్(1), బ్రౌస్(23), శిఖా పాండే(19) భారీస్కోర్లు చేయలేకపోయారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు రాధా యాదవ్(0), అరుంధతి రెడ్డి(4) ఎక్కువసేపు క్రీజ్‌లో నిలవలేకపోయారు. దీంతో ఢిల్లీ జట్టు స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బెంగళూరు కెప్టెన్ మంధాన(81), వాట్(42) తొలి వికెట్‌కు 107పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరూ ఔటయ్యాక పెర్రీ(7), రీచా ఘోష్(11) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. ఢిల్లీ బౌలర్లు శిఖా పాండే, అరుంధతి రెడ్డికి ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లానింగ్ (సి)పెర్రీ (బి)గార్త్ 17, షెఫాలీ (సి)మంధాన (బి)రేణుక 0, రోడ్రిగ్స్ (స్టంప్)రీచా (బి)వారేహామ్ 34, సథర్లాండ్ (సి)మంధాన (బి)రేణుక 19, కాప్ (సి)హోడ్జే (బి)ఏక్తా 12, జొన్నాసెన్ (సి)కనిక (బి)ఏక్తా 1, బ్రైస్ (స్టంప్)రీచా (బి)వారేహామ్ 23, శిఖా పాండే (సి)ఏక్తా (బి)రేణుక 14, రాధా (సి అండ్ బి)వారేహామ్ 0, అరుంధతి రెడ్డి (సి)ఎలైసే పెర్రీ (బి)గార్త్ 4, మిన్ను మణి (నాటౌట్) 5, అదనం 12. (19.3 ఓవర్లలో ఆలౌట్) 141పరుగులు.

వికెట్ల పతనం: 1/1, 2/60, 3/62, 4/84, 5/87, 6/105, 7/130, 8/130, 9/132, 10/141

బౌలింగ్: రేణుకా సింగ్ 4-0-23-3, గార్త్ 3.3-0-19-2, ఏక్తా బిస్ట్ 4-0-35-2, జోషిత 2-0-21-0, వారేహామ్ 4-0-25-3, కనిక అహుజ 2-0-13-0.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మహిళల ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి)అరుంధతి రెడ్డి (బి)శిఖా పాండే 81, వాట్ (సి)రోడ్రిగ్స్ (బి)అరుంధతి రెడ్డి 42, ఎలైసె పెర్రి (నాటౌట్) 7, రీచా ఘోష్ (నాటౌట్) 11, అదనం 9. (16.2ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 146పరుగులు.

వికెట్ల పతనం: 1/107, 2/133

బౌలింగ్: కాప్ 2-0-27-0, శిఖా పాండే 4-0-27-1, మిన్ను మణి 1-0-10-0, అరుంధతి రెడ్డి 3.2-0-25-1, జొన్నాసెన్ 4-0-37-0, సథర్లాండ్ 2-0-18-0.

డబ్ల్యుపిఎల్‌లో నేడు..
గుజరాత్ × ముంబయి
రాత్రి 7.30గం॥లకు



సోమవారం జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవాల రిహాల్సల్

ఛాంపియన్స్ ట్రోఫీకి సర్వం సిద్ధం

లాహోర్: 9వ ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్తాన్ వేదికగా 19నుంచి ప్రారంభం కానుంది. బుధవారం నుంచి జరిగే ఈ ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్తాన్ సర్వం సిద్ధం చేసింది. పాకిస్తాన్‌లోని కరాచీ, లాహోర్, రావల్పిండి వేదికలుగా క్రికెట్ మ్యాచ్‌లు జరగనుండగా.. భారత్ ఆడే మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లో జరగనున్నాయి. ఐసిసి టాప్-8 జట్ల మధ్య జరిగే ఈ సంగ్రామంలో టీమిండియా ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఐసిసి టాప్-8 ర్యాంక్ జట్ల మధ్య జరిగే ఈ ట్రోఫీలో ఆడే జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్-ఎలో భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్... గ్రూప్-బిలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ జట్లు ఉన్నాయి. గ్రూప్ దశ పోటీలు ముగిసాక టాప్-2లో ఉన్న రెండు జట్లు సెమీస్‌కు చేరనున్నాయి. గ్రూప్-ఎతో పోల్చిచూస్తే.. గ్రూప్-బిని గ్రూప్ ఆఫ్ డెత్‌గా క్రీడానిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ గ్రూప్‌లో ఉన్న జట్లన్నీ టైటిల్ ఫేవరెట్ జట్లే కావడమే ఇందుకు ప్రధాన కారణం.

విదర్భ 304/5

రంజీట్రోఫీ సెమీఫైనల్స్



సచిన్ బేబి(69నాటౌట్)

నాగ్‌పూర్: రంజీట్రోఫీ సెమీఫైనల్లో భాగంగా ముంబయితో జరుగుతున్న మ్యాచ్‌లో విదర్భ జట్టు పట్టు బిగిస్తోంది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన విదర్భ జట్టును ధృవ్ షోరే(74), దానిష్ మలేశ్వర్(79) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. దీంతో విదర్భ జట్టు తొలిరోజు ఆట ముగిసే సరికి 5వికెట్ల నష్టానికి 308పరుగులు చేసింది. ఓపెనర్ అథర్వ తైడే(4) నిరాశపరిచినా.. ధృవ్ షోరే, పార్త్ రేఖండే(23) రాణించారు. ఆ తర్వాత కరణ్ నాయర్(45) ఫర్వాలేదనిపించాడు. క్రీజ్‌లో యశ్ రాథోడ్(47), వికెట్ కీపర్, కెప్టెన్ అక్షయ్ వాడ్కర్(13) క్రీజ్‌లో ఉన్నారు. ముంబయి బౌలర్లు శివమ్ దూబే, శామ్స్ ములానికి రెండేసి, రోస్టన్ దాస్‌కు ఒక వికెట్ దక్కాయి.

అహ్మదాబాద్ వేదికగా కేరళ-గుజరాత్ జట్ల మధ్య జరుగుతున్న మరో సెమీస్‌లో కేరళ జట్టు తొలిరోజు ఆట ముగిసే సరికి 4వికెట్ల నష్టానికి 206పరుగులు చేసింది. సచిన్ బేబి(69నాటౌట్) రాణించాడు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కేరళను ఓపెనర్లు చంద్రన్(30), రోహన్(30) ఆదుకున్నారు. వీరి తర్వాత వరుణ్(10), సక్సేనా(30) పెవీలియన్‌కు చేరారు. క్రీజ్‌లో సచిన్‌కి తోడు అజారుద్దీన్(30) ఉన్నారు. గుజరాత్ బౌలర్లు నాగస్వల్లా, జడేజా, బిష్ణోయ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.



కతర్ అమీర్‌కు మోడీ ఘన స్వాగతం

న్యూఢిల్లీ : కతర్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్-థానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఘనస్వాగతం పలికారు. రెండురోజుల భారత పర్యటన కోసం సోమవారం వచ్చిన తమీమ్ కోసం న్యూఢిల్లీ విమానాశ్రయానికి మోడీ స్వయంగా వెళ్లి స్వాగతం పలకడం విశేషం. మంగళవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముని తమీమ్ కలుసుకోనున్నారు. అదే రోజు ప్రధానమంత్రి మోడీతోనూ చర్చలు జరపనున్నారు. మన దేశంలో కతర్ అమీర్ పర్యటించడం ఇది రెండోసారి. 2015 మార్చిలో ఆయన తొలిసారి భారతదేశాన్ని సందర్శించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

రద్దీ నియంత్రణకు చర్యలు

- రైల్వే శాఖ ప్రకటన

న్యూఢిల్లీ : రైల్వే స్టేషన్లలో రద్దీని నియంత్రించేందుకు పలు చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. స్టేషన్ హోల్డింగ్ ఏరియా, క్రౌడ్ కంట్రోల్ మాన్యువల్ ఏర్పాటు చేయడం, ప్రయాణికులు మెట్లపై కూర్చోవద్దని అవగాహన పెంచడం వంటి చర్యలు ఉన్నాయి. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట నేపథ్యంలో రైల్వే శాఖ ఈ చర్యలు ప్రారంభించనుందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం విలేకరులకు తెలిపారు. న్యూఢిల్లీలో రైల్ భవన్‌లో మంత్రి మాట్లాడుతూ సాధారణ రోజుల్లోనూ అధిక రద్దీ ఉండే 60 రద్దీ స్టేషన్లను గుర్తించామని చెప్పారు. ఈ స్టేషన్లలో శాశ్వతంగా లేదా, తాత్కాలికంగా హోల్డింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వీటి ద్వారా ప్లాట్ ఫారాలు రద్దీగా ఉండకుండా రైళ్ల రాకపోకలకు అనుగుణంగా ప్రయాణికులను అనుమతిస్తామని చెప్పారు. న్యూఢిల్లీ, పాట్నా, సూరత్, బెంగళూరు, కోయంబత్తూర్ వంటి 60 స్టేషన్లలో వీటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇప్పటికే అమల్లో ఉన్న అన్ని నిబంధనలను పాటిస్తూ ప్రత్యేక క్రౌడ్ మేనేజ్‌మెంట్ మాన్యువల్‌ను రూపొందిస్తామని చెప్పారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రయాణికుల రద్దీని నిర్వహణ చేయడానికి ఒక ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి చెప్పారు. ప్రయాణికులు మెట్లపై కూర్చోకుండా అవగాహన కల్పిస్తామని తెలిపారు. శనివారం జరిగిన తొక్కిసలాటపై విచారణ జరుపుతున్న కమిటీ నివేదిక ఎప్పుడు ఇస్తుందని విలేకరులు ప్రశ్నించగా, 'కమిటీకి ఎటువంటి సమయ వ్యవధిని నిర్ణయించలేదు. ఎందుకంటే ఇది కమిటీ సభ్యులపై అనవసరమైన ఒత్తిడిని తెస్తుంది' అని మంత్రి సమాధానం ఇచ్చారు.

నూతన సిఇసిగా జ్ఞానేష్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి)

మొగ్గుచూపింది. 2029 జనవరి 26 వరకూ ఆయన సిఇసిగా కొనసాగనున్నారు. ప్రస్తుత సిఇసి రాజీవ్ కుమార్ పదవీ కాలం మంగళవారంతో ముగియనుంది. జ్ఞానేష్‌కుమార్ కేరళ కేడర్‌కు చెందిన 1989 బ్యాచ్ ఐఎఎస్ అధికారి. అంతకుముందు ఆయన హోం మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలోని సహకార, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖల కార్యదర్శిగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌తోసహా అయోధ్య కేసుపై సుప్రీంకోర్టు తీర్పునకు సంబంధించిన విషయాలను చూసేందుకు హోం మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి ఆయన నేతృత్వం వహించారు.

నిరుద్యోగం... అధిక ధరలు

- ఇవే మోడీ ప్రభుత్వ అతి పెద్ద వైఫల్యాలు
- సర్కారు విధానాలు బడా వ్యాపారులకే అనుకూలం
- కేంద్ర సంస్థల దుర్వినియోగం
- 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో భారతీయుల మనోగతం



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలనలో దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, అధిక ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయని మెజారిటీ భారతీయులు అభిప్రాయపడ్డారు. మోడీ ప్రభుత్వ హయాంలో ఇవే అతి పెద్ద వైఫల్యాలని ఎత్తిచూపారు. ఇండియా టుడే, సి-ఓటర్ సంయుక్తంగా ఈ నెలలో నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే ప్రకారం దేశంలో నాలుగింట మూడు వంతులకు పైగా ప్రజలు నిరుద్యోగ పరిస్థితి చాలా తీవ్రంగా ఉన్నదనో లేదా కొంతమేర తీవ్రంగా ఉన్నదనో కుండబద్దలు కొట్టారు. 55 శాతం మంది చాలా తీవ్రంగా ఉన్నదని చెప్పగా 21 శాతం మంది కొంత వరకూ తీవ్రంగా ఉన్నదని తెలిపారు. కేవలం ఐదు శాతం మంది మాత్రమే తీవ్రంగా లేదని అన్నారు. సర్వే ప్రకారం ఈశాన్య ప్రాంతంలో 64 శాతం మంది, తూర్పు ప్రాంతంలో 60 శాతం మంది నిరుద్యోగ సమస్య చాలా తీవ్రంగా ఉన్నదని స్పష్టం చేశారు. దక్షిణాదిలో 48 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

గత 11 సంవత్సరాల మోడీ పాలనలో అతి పెద్ద వైఫల్యమేమిటని ప్రశ్నించగా 21 శాతం మంది నిరుద్యోగం, అధిక ధరలను ప్రస్తావించారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ఏమిటని ప్రశ్నిస్తే 24 శాతం మంది నిరుద్యోగాన్ని, 17 శాతం మంది అధిక ధరలు, ద్రవ్యోల్బణాన్ని ఉదహరించారు. రాబోయే ఆరు నెలల్లో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణిస్తుందని లేదా ఇలానే ఉంటుందని 57 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఈ సంవత్సరం ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని కేవలం 34 శాతం మంది మాత్రమే ఆశాభావం వ్యక్తం చేశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది దినసరి ఖర్చులను భరించడం కష్టంగా ఉన్నదని 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో పాల్గొన్న 64 శాతం మంది నిట్టూర్పు విడిచారు. ఖర్చులు పెరిగినప్పటికీ ఎలాగోలా నెట్టుకొస్తున్నామని 27 శాతం మంది చెప్పారు.

తక్కువ ఆదాయాన్ని పొందుతున్న వారిలో 70 శాతం మంది ప్రస్తుత ఖర్చులను భరించడం కష్టంగా ఉన్నదని వాపోయారు. 82 శాతం మంది యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ పథకానికి మద్దతు ఇవ్వగా 14 శాతం మంది మాత్రమే వ్యతిరేకించారు. ఇది కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సాంఘిక సంక్షేమ పథకం. దీని కింద పౌరులందరూ బేషరతు నగదు బదిలీ రూపంలో కనీస ఆదాయాన్ని పొందుతారు. కాగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు బడా వ్యాపారులకే అనుకూలంగా ఉన్నాయని సర్వే తేల్చి చెప్పింది. 2014 నుండి మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల ద్వారా బడా వ్యాపార సంస్థలే ప్రయోజనం పొందుతున్నాయని 51 శాతం మంది తెలిపారు. ప్రభుత్వ విధానాల ద్వారా వేతన జీవులు లబ్ది పొందుతున్నారని కేవలం 9 శాతం మంది చెప్పగా దినసరి కార్మికులకు ప్రయోజనం చేకూరుతోందని 6 శాతం మంది అన్నారు. రాబోయే ఆరు నెలల కాలంలో తమ కుటుంబ ఆదాయం లేదా జీతం తగ్గిపోవడమో, ఇలాగే ఉండడమో జరుగుతుందని మరో ప్రశ్నకు జవాబుగా 65 శాతం మంది చెప్పారు. ఈ ఏడాది తమ జీతాలు పెరగవచ్చునని 27 శాతం మంది మాత్రం ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇతర ఏ ప్రభుత్వంతో పోల్చినా మోడీ సర్కార్ ఇడి, సిబిఐ, ఐటి వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఎక్కువగా దుర్వినియోగం చేసిందని 45 శాతం మంది కుండబద్దలు కొట్టారు. 42 శాతం మంది ఈ అభిప్రాయంతో విభేదించారు. అమెరికా కోర్టు ముడుపుల ఆరోపణలు నమోదు చేసిన నేపథ్యంలో మోడీ ప్రభుత్వం వివాదాస్పద అదానీ గ్రూపును వెనకేసుకొస్తోందా అని ప్రశ్నించగా 49 శాతం మంది అవునని, 33 శాతం మంది కాదని బదులిచ్చారు. భారత వ్యతిరేక కార్యకలాపాల కోసం కాంగ్రెస్ పార్టీ జార్జ్ సోరొస్ నుండి నిధులు తీసుకున్నదని బిజెపి చేసిన ఆరోపణలను 47 శాతం మంది తోసిపుచ్చారు. అధికార పార్టీ వాదనలో వాస్తవం ఉన్నదని 38 శాతం మంది 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వేలో తెలిపారు.

ఉచిత రేషన్ పైనే మనుగడ సాధ్యమా?

- ప్రజలు పనిచేయడం లేదనడం సరికాదు
- జస్టిస్ గవాయ్‌కి 300 మందికి పైగా ప్రముఖుల లేఖ

న్యూఢిల్లీ : ఉచితాలపై న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. రాజ్యసభ మాజీ సభ్యురాలు, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ తప్పుపట్టిన విషయం విదితమే. తాజాగా 300 మందికి పైగా ప్రముఖులు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ వ్యాఖ్యలను 300 మందికి పైగా ప్రముఖులు ఖండిస్తూ.. ఇది జాతికి సిగ్గుచేటని అభివర్ణించారు. 'ఉచితాల'పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను 300 మందికి పైగా ప్రముఖులు ఖండిస్తూ బహిరంగ లేఖ రాశారు. వీరిలో హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులు, పాత్రికేయులతోపాటు గూడు లేని, అట్టడుగు వర్గాల ప్రజల కోసం పనిచేస్తున్న పలు సంఘాల ప్రతినిధులు ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో గృహవసతి లేని పేదల కోసం షెల్టర్లు నిర్మించాలంటూ ఇఆర్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ గవాయ్, జస్టిస్ ఎజి మసిహ్‌తో కూడిన బెంచ్ విచారణ జరుపుతోంది. ఆ సందర్భంగా జస్టిస్ గవాయ్ ఉచితాలు పరాన్నజీవులను సృష్టిస్తున్నాయని వ్యాఖ్యానించారు. దీనిపై పలువురు ప్రముఖులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ 'ఆయన వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థలో పేదల వ్యతిరేక పక్షపాత ధోరణికి అద్దం పడుతున్నాయి. పట్టణ పేదల్లో గూడు లేని వారు అత్యంత దుర్బలురు. పట్టణ అనధికారిక ఆర్థిక వ్యవస్థకు వారు వెన్నెముక వంటి వారు. నిర్మాణ పనులు, బరువులు మోయడం, పారిశుధ్య పనులు, వివాహ కార్యక్రమాల్లో క్యాటరింగ్ వంటి కష్టతరమైన విధులు నిర్వర్తిస్తుంటారు' అని వారు ఆ బహిరంగ లేఖలో వివరించారు. 'నిరాశ్రయులను పరాన్నజీవులు అని పిలవడం నిర్దయకు, బండబారిన మనస్తత్వానికి సంకేతం. పౌరులు... ముఖ్యంగా దుర్బలులైన వారి హక్కులు, స్వేచ్ఛను రక్షించే బాధ్యత కలిగిన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి నుండి ఈ వ్యాఖ్యలు ఆశించలేదు. బాధితులను నిందించడమో లేదా అవమానించడమో కాకుండా వారి జీవితాలను రక్షించడం సమాజం, ప్రభుత్వ సంస్థల బాధ్యత. నగర నిర్మాతలైన బడుగు జీవుల మరణాలను నివారించే అవకాశం ఉన్నప్పటికీ ఆ పని చేయకపోవడం జాతికి సిగ్గుచేటు' అని ఆ బహిరంగ లేఖలో ప్రముఖులు విమర్శించారు.

కోర్టుకు హాజరు కాని కేజ్రీవాల్

- 'యమున'పై వ్యాఖ్యల కేసు మార్చి 20కి వాయిదా

సోనీపట్ : యమునా నదీ జలాలు విషతుల్యం అవుతున్నాయంటూ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హర్యానాలోని సోనీపట్ కోర్టుకు సోమవారం హాజరు కాలేదు. కోర్టుకు హాజరు కావాల్సిందిగా న్యాయస్థానం నోటీసు జారీ చేసినప్పటికీ కేజ్రీవాల్‌కు బదులు ఆయన న్యాయవాది భువేష్ మాలిక్ వచ్చారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా చేసిన క్రిమినల్ ఫిర్యాదుకు సంబంధించి ప్రాసిక్యూషన్ తమకు ఎలాంటి ఆధారాలు అందించలేదని మాలిక్ కోర్టుకు తెలిపారు. దీంతో కేజ్రీవాల్ వ్యాఖ్యలకు సంబంధించిన రుజువులు, ఇతర ఆధారాలను ఆయనకు ఓ పెన్ డ్రైవ్‌లో అందజేశారు. యమునా నదీ జలాలను హర్యానా విషపూరితం చేస్తోందని కేజ్రీవాల్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనపై హర్యానా నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశిష్ కౌశిక్ ఫిర్యాదు చేశారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు ముందు కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. కేసు విచారణను సోనీపట్ కోర్టు మార్చి 20వ తేదీకి వాయిదా వేసింది.

చరిత్రలో అతిపెద్ద స్కాం

- యుఎస్ఎయిడ్‌పై ప్రధాని మోడీ సలహాదారు సన్యాల్

న్యూఢిల్లీ : యుఎస్ఎయిడ్ ఏజెన్సీపై ప్రధాని మోడీ సలహాదారు సంజీవ్ సన్యాల్ ఘాటుగా స్పందించారు. మానవ చరిత్రలో అది ఒక అతిపెద్ద స్కాం అని అభివర్ణించారు. 'భారత్‌లో ఓటింగ్ పెరుగుదల'కు ఉద్దేశించిన 21 మిలియన్ డాలర్ల యుఎస్ ఫండ్స్‌ను రద్దు చేస్తున్నట్టు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) ఇటీవల తెలిపిన విషయం తెలిసిందే. దీనికి స్పందనగానే ప్రధాని సలహాదారు పైవిధంగా స్పందించారు. డోజ్‌కు ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన ఎలన్ మస్క్ నేతృత్వం వహిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చిన తర్వాత ఈ డోజ్‌కు యుఎస్ఎయిడ్ టాప్ టార్గెట్‌గా ఉన్నది. భారత్‌లో ఓటింగ్‌ను పెంచే నిధులుగా చెప్పబడిన యుఎస్ ఫండ్స్ రద్దు విషయం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మెడకు చుట్టుకుంటున్నది. భారతదేశ ఎన్నికల ప్రక్రియలో విదేశీ శక్తుల జోక్యాన్ని ఇది తెలియజేస్తున్నదనే పలు ఆరోపణలు కేంద్రంపై వచ్చాయి. దీంతో ఈ అంశంపై బీజేపీ స్పందిస్తోంది. డోజ్ వ్యాఖ్యలను కొట్టి పారేస్తున్నది. అందులో నిజం లేదని అంటున్నది. ఇప్పుడు ప్రధాని మోడీ ఎకనామిక్ అడ్వైజరీ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్న సంజీవ్ సన్యాల్ స్పందించారు. 21 మిలియన్ డాలర్ల నిధులు భారత్‌లో ఎవరికి అందాయో తాను తెలుసుకోవాలనుకుంటున్నానని అన్నారు. అలాగే, బంగ్లాదేశ్‌కు అందాయని చెప్పబడుతున్న 29 మిలియన్ డాలర్లు, నేపాల్ 'ఆర్థిక సమాఖ్య' మెరుగుదలకు ఖర్చు చేశామన్న 29 మిలియన్ డాలర్ల సాయం గురించి కూడా ఆయన ప్రశ్నించారు.

అమెరికాలో భారీ వర్షాలు..

- 10 మంది మృతి

వాషింగ్టన్: అమెరికాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దంచికొడుతున్న వర్షాల కారణంగా వరదలు ముంచెత్తాయి. వర్షంతో పాటుగా భారీ గాలులు కారణంగా పలు భవనాలు, ఆస్తులు ధ్వంసం అవుతున్నాయి. భారీ వర్షాల కారణంగా 10 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. అమెరికాలో భారీ తుఫాన్ల కారణంగా వరదలు ముంచెత్తాయి. వర్షాల కారణంగా కెంటుకీలో ప్రాణనష్టం జరిగింది. కెంటుకీలో గడిచిన 48 గంటల్లో రికార్డ్ స్థాయిలో వర్షం కురిసింది. వరదలు కారణంగా ఇప్పటి వరకు తొమ్మిది మంది చనిపోయారని అధికారులు తెలిపారు. కార్లు నీటిలో చిక్కుకుని మునిగిపోవడంతో వీరు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక చిన్నారి కూడా ఉన్నట్టు సమాచారం. అంతేకాకుండా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు 39,000 ఇళ్లల్లో విద్యుత్ నిలిచిపోయింది. దీంతో పలుచోట్ల అంధకారం అలుముకుంది. పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని కెంటుకీ గవర్నర్ తెలిపారు. వర్జీనియా, పశ్చిమ వర్జీనియా, టేనస్సీలో కూడా వరదలు సంభవించాయి. ఇదిలా ఉండగా.. కొద్దిరోజుల పాటు వర్షాలు, భారీ స్థాయిలో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. మరోవైపు.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా వరదలపై సమీక్షిస్తున్నారు. ఇక, వరదల్లో చిక్కుకున్న వారిని రెస్క్యూ టీమ్స్ కాపాడుతున్నాయి. సహాయక చర్యలను సమన్వయం చేయడానికి ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి అధికారం ఇచ్చారు. ఫెడరల్ నిధులు వినియోగించి అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని ట్రంప్ ఆదేశించారు. ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు.



ఆందోళన చేస్తున్న నేపాల్ విద్యార్థులు

నేపాల్ విద్యార్థిని ఆత్మహత్యతో ఒడిశా వర్సిటీలో ఉద్రిక్తత

- స్వదేశానికి వెళ్లాలంటూ 500 మందికి ఆదేశం

భువనేశ్వర్ : ఒడిశాలోని ఒక ప్రైవేట్ విశ్వవిద్యాలయంలో నేపాల్ నుంచి వచ్చిన ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. భువనేశ్వర్‌లోని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్) విశ్వవిద్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆందోళన నిర్వహించిన 500కు పైగా నేపాలీ విద్యార్థులను క్యాంపస్ నుంచి స్వదేశానికి వెళ్లాలని వర్సిటీ ఆదేశించింది. పోలీసుల కథనం ప్రకారం నేపాల్ నుంచి వచ్చి మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆదివారం తన హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు కారణమైన విద్యార్థిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నేపాల్ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. దీంతో, నేపాల్ నుంచి వచ్చిన విద్యార్థులను క్యాంపస్ నుంచి వెళ్లిపోవాలని వర్సిటీ ఆదేశించింది. దీంతో, 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కటక్ రైల్వే స్టేషన్ వద్ద బస్సులలో విద్యార్థులను చేరవేశారు. చాలామంది విద్యార్థులు ఇంటికి తిరిగి వెళ్లడానికి రైలు టికెట్లు లేని స్థితి ఏర్పడింది. నేపాల్ ప్రధానమంత్రి కెపి శర్మ ఓలి స్పందిస్తూ, విద్యార్థులు ఇక్కడ వెళ్లాలనుకున్నా, హాస్టల్‌లో ఉండాలనుకున్నా అవకాశం కల్పించేందుకు ఎంబసీ నుండి ఇద్దరు అధికారులను పంపినట్లు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. తొలుత తక్షణం క్యాంపస్‌ను ఖాళీ చేయాలని ఆదేశించిన వర్సిటీ... ఆ తరువాత విచారణ పూర్తయ్యేవరకూ తమ సంరక్షకుల సహాయంతో ఇళ్లకు వెళ్లాలని సూచించినట్లు పేర్కొంది. విద్యార్థిని మొబైల్ ఫోన్, లేప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు భువనేశ్వర్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ పినాక్ మిశ్రా తెలిపారు. ఆమె భౌతికకాయాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. విద్యార్థిని ఆత్మహత్యకు కారణంగా భావిస్తున్న విద్యార్థిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారని, వారిద్దరి మధ్య వివాదం వల్లే ఆమె ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని తెలిపారు. ఇంటికి వెళ్లేందుకు డబ్బులు కూడా లేవంటూ పలువురు నేపాల్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

త్రిసభ్య బెంచ్‌కి ప్రార్థనా స్థలాల చట్టం కేసు

- కొత్త పిటిషన్ల విచారణకు సుప్రీం నిరాకరణ
- తదుపరి విచారణ ఏప్రిల్‌కు వాయిదా

న్యూఢిల్లీ : 1991వ సంవత్సరపు ప్రార్థనా స్థలాల చట్టానికి సంబంధించి దాఖలైన కేసుల విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్ మొదటి వారానికి వాయిదా వేసింది. దీనిపై త్రిసభ్య బెంచ్ విచారణ జరుపుతుందని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి సంజయ్ కుమార్‌తో కూడిన బెంచ్ తెలిపింది. చట్టం చెల్లుబాటును ప్రశ్నిస్తూ అనేక కొత్త పిటిషన్లు దాఖలవుతుండడంతో న్యాయమూర్తులు సోమవారం అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తగా దాఖలైన పిటిషన్‌ను విచారించాలంటూ సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ కోరగా, సాధ్యం కాదని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. 'కొత్తగా అనేక పిటిషన్లు దాఖలవుతుండడంతో మేము ఈ ఆదేశాలు జారీ చేయాల్సి వస్తోంది. నోటీసులు ఇవ్వని పెండింగ్ రిట్ పిటిషన్లను తిరస్కరిస్తున్నాము. మరో కారణం ఏదైనా ఉంటే దానిని చూపించి మళ్లీ ఐఎ (ఇంటర్‌వెన్షన్ అప్లికేషన్) దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిలో కొత్త విషయం కానీ, చట్టపరమైన కొత్త అంశం కానీ ఉన్నప్పుడే అనుమతించడం జరుగుతుంది. పెండింగ్ పిటిషన్లలో అయా అంశాలు ఉండకూడదు' అని బెంచ్ తెలిపింది. గతంలో త్రిసభ్య బెంచ్ విచారించిన పెండింగ్ పిటిషన్లను విచారించబోమని అంటూ తమది ద్విసభ్య బెంచ్ అని గుర్తు చేసింది. కొత్త కారణాలతో తాజాగా పిటిషన్లు దాఖలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, ఇప్పటికే కోర్టు ముందున్న పిటిషన్లతోపాటు వీటిని కూడా పరిష్కరించడం అసాధ్యంగా కన్పిస్తోందని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. రిట్ పిటిషన్ల దాఖలుకు గడువు అంటూ ఒకటుండాలని, ఏదో ఒకచోట వాటికి ముగింపు పలకాల్సి వస్తుందని తెలిపారు. పిటిషన్ల దాఖలుకు పరిమితి ఉంటుందని, ఇప్పటికే అనేక ఐఎ పిటిషన్లు దాఖలయ్యాయని, వాటిని తాము విచారించలేమని ఆయన తెలిపారు. ఒరిజినల్ పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది వాదిస్తూ అత్యున్నత న్యాయస్థానం 2021 మార్చిలో నోటీసు జారీ చేసినప్పటికీ కేంద్రం ఇప్పటి వరకూ స్పందించలేదని చెప్పారు. దీనిపై న్యాయమూర్తులు స్పందిస్తూ ప్రతిసారీ ఏదో ఒక కొత్త అంశాన్ని లేవనెత్తుతున్నారని అన్నారు.

ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోకూడదు ?

- మసీదు కూల్చివేతపై యుపి ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లోని కుషీనగర్‌లో ఉన్న మద్నీ మసీదులో ఓ భాగాన్ని కూల్చివేసిన ఘటనలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై ధిక్కరణ చర్యలు చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌ను పురస్కరించుకొని సుప్రీంకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. గత సంవత్సరం నవంబర్ 13న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ముందస్తు నోటీసు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారంటూ పిటిషనర్ ఆరోపించారు. దీనిపై జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసిహ్‌తో కూడిన బెంచ్ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ ఆ ప్రదేశంలో ఎలాంటి కూల్చివేతలు జరపరాదని కూడా ఆదేశించింది.

'పిటిషనర్ల ఆధీనంలో ఉన్న ప్రైవేటు భూమిలో మసీదును నిర్మించారని చెబుతున్నారు. ఆ నిర్మాణానికి 1999లో మున్సిపల్ అధికారులు అనుమతి మంజూరు చేశారు. మసీదు నిర్మాణానికి అధికారులు ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని 2006 ఫిబ్రవరి 12న హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అవి అమలు కాలేదు. కాబట్టి మున్సిపల్ అధికారులు ఇచ్చిన అనుమతులు ఇప్పటికీ అమలులోనే ఉన్నాయి' అని సుప్రీంకోర్టు తన ఆదేశాలలో తెలిపింది. 'ఫిర్యాదు ఆధారంగా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ విచారణ జరిపారని ఫిర్యాదుదారు చెబుతున్నారు. అనుమతించిన ప్లాన్ ప్రకారమే నిర్మాణం జరిగిందని మేజిస్ట్రేట్ తన విచారణలో తేల్చారు. అనుమతి లేని నిర్మాణాలను పిటిషనర్లే స్వయంగా తొలగించారని కూడా ఆయన గుర్తించారు' అని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.

న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ మసీదును కూల్చారని సుప్రీంకోర్టు నిర్ధారించింది. ఇందుకు బాధ్యులైన వారిపై ఎందుకు కోర్టు ధిక్కార చర్యలు చేపట్టకూడదో చెప్పాలంటూ రెండు వారాల సమయం ఇచ్చింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకూ నిర్మాణాన్ని కూల్చివేయరాదని ఆదేశించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ వాదనలు వినిపిస్తూ కూల్చివేతకు సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి నోటీసు ఇవ్వలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇది కోర్టు ధిక్కారమే అవుతుందని చెప్పారు. పోలీసులు, అధికారులు కూల్చివేతలు జరపడానికి ముందు విచారణ జరిపిన సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్‌ను బదిలీ చేశారని తెలిపారు.

తప్పులు సరిదిద్దుకోండి

- తైవాన్ విషయంలో అమెరికాకు చైనా హెచ్చరిక

బీజింగ్ : తైవాన్ విషయంలో చేస్తున్న తప్పులను సరిదిద్దుకోవాలని అమెరికాను చైనా హెచ్చరించింది. 'తైవాన్ స్వాతంత్ర్యానికి మద్దతు ఇవ్వం' అనే పదాలను అమెరికా విదేశాంగ శాఖ తన వెబ్‌సైట్‌లో తొలగించింది. అంతర్జాతీయ సంస్థల్లో తైవాన్ గుర్తింపునకు మద్దతు ఇస్తామని, పెంటగాన్ సాంకేతిక, సెమికండక్టర్ల అభివృద్ధి ప్రాజక్టుకు తైవాన్ సహకారం అందిస్తున్నట్లు వెబ్‌సైట్‌లో విదేశాంగశాఖ పేర్కొంది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తరువాత, గతవారంలో విదేశాంగ శాఖ వెబ్‌సైట్ ఈ విధమైన అప్‌డేట్లు చేసింది.

ఈ నేపథ్యంలో చైనా సోమవారం ఈ హెచ్చరిక చేసింది. తైవాన్‌కు అంతర్జాతీయ గుర్తింపును, తైవాన్ లేదా తైవాన్ విదేశాంగ శాఖ అధికారులతో సంబంధాలను చైనా ఎల్లప్పుడూ తిరస్కరిస్తుందని తెలిపింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గువో జియాకున్ బీజింగ్‌లో మాట్లాడుతూ 'అమెరికా తన వెబ్‌సైట్‌లో ఈ విధమైన అప్‌డేట్లు చేయడం తైవాన్‌లోని వేర్పాటువాద శక్తులకు తప్పుడు సందేశాన్ని పంపుతుంది' అని విమర్శించారు. 'చైనాను నియంత్రించడానికి తైవాన్‌ను ఉపయోగించడం అనే తప్పుడు విధానానికి అమెరికా మొండిగా కట్టుబడి ఉందనడానికి ఇది మరో ఉదాహరణ. అమెరికా తన తప్పులను తక్షణమే సరిదిద్దుకోవాలని మేం హెచ్చరిస్తున్నాం' అని గువో తెలిపారు.

భూముల లీజు కాదు... కార్పొరేట్ల కబ్జా

(మొదటి పేజీ తరువాయి)

వారికి 100 శాతం లాభమేనని వెల్లడించారు. వినియోగదారుల నుండి ప్రతి యూనిట్‌కు రూ.2.49 పైసలు 25 సంవత్సరాలపాటు వసూలు చేస్తారని అన్నారు. జనంపై లక్ష 20 వేల కోట్లు అదనపు భారం పడుతుందన్నారు. అటు రైతులను, ఇటు వినియోగదారులను నిలువునా ముంచుతున్నారని, ఈ చట్ట వ్యతిరేక, అక్రమ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతులు భూయజమానుల నుండి భూమి కౌలుకు తీసుకుంటే 11 నెలలకే ఉండే విధంగా చట్టం చేశారని, అదే సోలార్ పవర్‌కు కార్పొరేట్ కంపెనీలు 30 సంవత్సరాలు ఒప్పందాలు ఒకేసారి ఎలా చేసుకుంటాయని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం లీజు రెన్యూవల్ చేయాలని, ఎకరాకు నెలకు రూ. 30 వేలు లీజు ఇవ్వాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికులకు కూడా ప్రతి సంవత్సరం పరిహారం చెల్లించాలని కోరారు.

అమెరికాకు దేశాన్ని తాకట్టు పెట్టిన మోడీ

అమెరికా పర్యటనకు ముందు అదానీ కేసు విచారణ జరగకుండా ట్రంప్ చేత చట్టసవరణ చేయించి గిఫ్ట్ పొందిన మోడీ రిటన్ గిఫ్ట్ కింద ఎఫ్-35 విమానాలు, ఆయిల్, గ్యాస్ అమెరికా నుండి కొనుగోలు చేసి వారికి లబ్ది చేకూరుస్తున్నారని, దీనివల్ల అమెరికా వాణిజ్యలోటు తగ్గుతుందని, మన దేశంపై భారం పడుతుందని శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటికే తక్కువ రేటుకి రూపాయిల్లో రష్యా, ఇరాన్ నుండి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్నామని, ఇప్పుడు దాన్ని ఆపి అమెరికా నుండి కొనుగోలు చేయడం నష్టమని పేర్కొన్నారు. ఎఫ్-35 యుద్ధ విమానాలకు కాలం చెల్లిందని ఏడాది క్రితమే మస్క్ చెప్పారని వాటిని ఎలా కొనుగోలు చేస్తామని ప్రశ్నించారు. కాలం చెల్లిన ఆయుధాలు కొని అమెరికాకు లాభం చేకూర్చేలా చూస్తున్నారని అన్నారు. మరోవైపు అదే అమెరికా మన దేశ పౌరులకు వీసాల్లేవని బేడీలు వేసి అవమానంగా విమానాల్లో పంపిస్తుంటే నోరు మెదపడం లేదని, ఇది భారతీయ ఆత్మగౌరవాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడమేనని అన్నారు. అమెరికా ఎంబసీకి నిరసన తెలపాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీలు దూరంగా ఉండాలి

ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలను టీచర్లు, విద్యావంతులకు వదిలేయాలని శ్రీనివాసరావు రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో వైసిపి పోటీ చేయకుండా పిడిఎఫ్‌ను బలపరుస్తున్నదంటున్నారని ఒక విలేకరి ప్రస్తావించగా వైసిపి పోటీ చేయకపోవడం మంచిదేనని, అదే విధంగా టిడిపి కూటమి కూడా పోటీ చేయకుండా ఉండాల్సిందని అన్నారు. విద్యావంతుల, టీచర్ల హక్కును హైజాక్ చేయొద్దని శాసనమండలిలో వారి గొంతు వినపడకుండా చేయడానికే టిడిపి పోటీ చేస్తున్నదని, పిడిఎఫ్ టీచర్లు, విద్యావంతుల తరపున నిలబడుతున్నదని చెప్పారు.

సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటాం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను క్రమబద్ధీకరించే అంశంపై మాట్లాడుతూ వారిని తొలగించినా, వేధించినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వలంటీర్లకు జీతం రూ.10 వేలు ఇస్తామని వాగ్దానం చేసిన టిడిపి ఇప్పుడు ఏకంగా వారిని తొలగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మాట తప్పి మోసం చేయడం సరికాదన్నారు.

ప్రజల అప్పు ఎవరు తీరుస్తారు?

ప్రభుత్వం అప్పుల్లో ఉందని, సంక్షేమ పథకాలు అమలు చేయలేమని చంద్రబాబు అంటున్నారని ఒక విలేకరి ప్రశ్నించగా ప్రజలు అప్పుల్లో ఉన్నారని వాటిని ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవడం కనిపించడం లేదా అన్నారు. ప్రజలపై భారం వేస్తే ప్రతిఘటిస్తామన్నారు.

రానున్న బడ్జెట్‌లో కేటాయింపులు చూశాక విద్యుత్ చార్జీల తగ్గింపు కోసం కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని, అదానీకోసం జరిగిన సెకీ ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణా, తమిళనాడు ప్రభుత్వాలు అదానీ ఒప్పందాలు రద్దు చేసుకున్నాయని తాజాగా శ్రీలంక అదానీ ఒప్పందాన్ని సమీక్షించడంతో అదానీ కంపెనీ వెనక్కి వచ్చేసిందని, చంద్రబాబు ప్రభుత్వం దాన్ని ఎందుకు కొనసాగిస్తున్నదని ప్రశ్నించారు. వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు పెట్టడం లేదంటూనే షిర్డిసాయి కంపెనీకి నిర్వహణ ఖర్చులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

పవన్‌కళ్యాణ్ గుడుల దర్శనంపై స్పందిస్తూ అది ఆయన వ్యక్తిగత కార్యక్రమమని, కానీ మతం పేరుతో విద్వేషాలు పెంచడాన్ని శ్రీనివాసరావు వ్యతిరేకించారు. పవన్ చర్యలు, మాటలు ఆర్ఎస్ఎస్‌కు తోడ్పడుతున్నాయని, మత సామరస్యానికి భంగమని అన్నారు. చిలుకూరు బాలాజీ పూజారి రంగరాజన్‌పై దాడి జరిగితే సిపిఎం స్పందించి ఆయన్ను కలిసి సంఘీభావం తెలిపిందని, కానీ పవన్ వెళ్లి ఎందుకు మద్దతు ప్రకటించలేదని ప్రశ్నించారు. ఆయనకు హిందూ మతంపై కన్నా ఆర్ఎస్ఎస్ మతోన్మాద సిద్ధాంతంపై విశ్వాసమని విమర్శించారు.

రాష్ట్రాలదే బాధ్యత

- ఆర్‌టిఐ దరఖాస్తుకు ఎన్ఎంసి సమాధానం
- స్టైఫండ్ చెల్లించని ప్రయివేటు మెడికల్ కాలేజీల విషయంలో కమిషన్ తీరిది

న్యూఢిల్లీ : అండర్‌గ్రాడ్యుయేట్ ఇంటర్న్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ రెసిడెంట్స్, సీనియర్ రెసిడెంట్స్‌కు ఉపకార వేతనాలు (స్టైఫండ్) చెల్లించని ప్రయివేటు మెడికల్ కాలేజీల విషయంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. ఈ విషయంలో ఎన్ఎంసి భారాన్నంతా రాష్ట్రాలపై నెట్టి చేతులు దులుపుకుంటున్నది. దీంతో ఎన్ఎంసి తీరు వివాదాస్పదమవుతున్నది.

విద్యార్థులకు 198 మెడికల్ కాలేజీలు, ఇన్‌స్టిట్యూట్‌లు ఇలా స్టైఫండ్‌లు చెల్లించలేదు. ఈ అంశంలో దాఖలైన ఆర్‌టిఐ దరఖాస్తుకు ఎన్ఎంసి స్పందించింది. ఈ విషయంలో మెడికల్ కాలేజీలు, ఇన్‌స్టిట్యూట్‌లు ఎక్కడ ఉంటే అక్కడి రాష్ట్రాల బాధ్యత అని వివరించింది. విద్యార్థులకు స్టైఫండ్ చెల్లింపులతోపాటు ఏదైనా నిబంధన ఉల్లంఘన జరిగితే, తప్పు చేసిన మెడికల్ కాలేజీపై చర్యలు తీసుకోవచ్చని ఎన్ఎంసి నిబంధనలు చెప్తున్నాయి. ఉల్లంఘించిన సదరు సంస్థ అక్రిడిటేషన్ నిలుపుదల, ఐదేళ్ల పాటు రద్దు, రూ.1 కోటి పెనాల్టీని విధించొచ్చు. ఎన్ఎంసి ఈ బాధ్యతను రాష్ట్రాలపై నెట్టివేయటంపై సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. కేంద్ర ఆరోగ్య మంత్రి జెపి నడ్డా సైతం ఇదే విషయాన్ని చెప్పారు. రెసిడెంట్లకు స్టైఫండ్‌లు చెల్లించే బాధ్యత రాష్ట్రాలదే అని అన్నారు. చెల్లింపులు జరగని విషయాన్ని రాష్ట్రాల దృష్టికి తీసుకొస్తే, అవి దానిపై చర్యలు తీసుకుంటాయని ఆయన చెప్పటం గమనార్హం. ఆర్‌టిఐ దరఖాస్తును డాక్టర్ కెవి బాబు వేశారు. దీనికి ఎన్ఎంసి ఈనెల 10న స్పందించింది. "ఎన్ఎంసి అనేది ఒక నియంత్రణ సంస్థ. ఇది కాలానుగుణంగా మార్గదర్శకాలు, నిబంధనలను విడుదల చేస్తుంది" అని వివరించింది. వాటిని అమలు చేసే బాధ్యత మెడికల్ కాలేజీలు కేంద్రీకృతమై ఉన్న రాష్ట్రాలదేనని పేర్కొన్నది. అయితే, స్టైఫండ్‌కు సంబంధించిన సమాచార సేకరణ ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించింది. గత నవంబర్‌లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్ఎంసి.. 115 ప్రభుత్వ, 83 ప్రయివేటు కాలేజీల, ఇన్‌స్టిట్యూట్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ.. ఈ నోటీసులకు మెడికల్ కాలేజీలు స్పందించలేదు. ఇటు.. వాటిపై ఎలాంటి చర్యలనూ తీసుకోకపోవటం గమనార్హం. ఇప్పుడు రష్ట్ర యంత్రాంగాలదే బాధ్యత అని ఎన్ఎంసీ చెప్తున్నదని కేరళకు చెందిన డాక్టర్ కె.వి బాబు అన్నారు.

రెండు వేల మందికి స్టైఫండ్ అందలేే

ఎన్‌హెచ్ఆర్‌సి ఆదేశాల ప్రకారం.. 2023లో యుజి, పిజి విద్యార్థులకు అందిన ఉపకార వేతనాల మొత్తాన్ని నిర్ధారించటానికి ఎన్ఎంసి సర్వే నిర్వహించింది. మొత్తం 7000 మంది పిజి విద్యార్థులకు గానూ 2000 మందికి స్టైఫండ్ అందలేదని ఈ సర్వేలో తేలింది. ఇందులో అధికం ప్రయివేటు కాలేజీల నుంచేనని వెల్లడైంది. 1228 మందిని.. వారు పొందిన ఉపకార వేతనాలను తిరిగి ఇచ్చేయాలని కాలేజీ యాజమాన్యాలు అడిగినట్టు ఈ సర్వేలో తేలింది.

वित्त मंत्रालय
MINISTRY OF FINANCE
Government of India
सत्यमेव जयते

ACCELERATING MSME



UNION BUDGET 2025-2026

BENEFITS FOR MSMEs THAT BENEFIT THE NATION

అన్ని రంగాలకు చందిన ఎంఎస్ఎంఈల్లో పెట్టుబడులు, టర్నోవర్ పరిమితులు వరుసగా 2.5 రెట్లు, 2 రెట్లు పెంపు

పెంచిన రుణ హామీలు:

- సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు: రూ. 5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంపు
- అంకుర సంస్థలకు: రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంపు
- అద్భుత పనితీరుతో ఎగుమతులు నిరవహించే ఎంఎస్ఎంఈలకు: రూ. 20 కోట్ల వరకు

ఉద్యమ్ పోర్టర్లలో నమోదు చేసుకున్న సూక్ష్మ తరహా పరిశ్రమలకు రూ. 5 లక్షల పరిమితితో క్రెడిట్ కార్డులు

22 లక్షల ఉద్యోగాల కల్పన, 4 లక్షల కోట్ల టర్నివర్ లక్ష్యంగా తోలు, పాదరక్షల పరిశ్రమాభివృదికి ప్రత్యేక పథకం. వెట్ బ్లూ లెదర్ దిగుమతులకు ప్రాథమిక కస్టమ్ సుంకం నంచి పూరిగా మినహాయింపు. క్రస్ట్ లెదర్ ఎగుమతులపై విధిస్తున్న 20% సుంకం తొలగింపు.

తొలిసారిగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగే ఎస్సీ, ఎస్టీ మహిళలతో సహా 5 లక్షల మంది మహిళలకు వచ్చే ఐదేళ్లలో రూ.2 కోట్ల వరక రుణాలు.

LI-ION

లిథియం-అయాన్ బ్యాటరీ (మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు)ల దేశీయ తయారీని పెంచే దిశగా 63 కొత్త ముడి సరకులకు పన్ను మినహాయింపు

DUTY FREE

కోబాల్ట్ పౌడర్-వ్యర్థాలు, లిథియం-అయాన్ బ్యాటరీల తక్కు, సీసం, జింకు మరో 12 కీలకమైన ఖనిజాలపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీ నుండి పూర్తి మినహాయింపు

వ్యాపార నిర్వహణకు అవసరమైన డాక్యుమెంట్ల, పరిశీలన, మరింత సులభంగా రుణ సదుపాయాలు, సుంకేతర అడ్డంకుల తగ్గింపు, అంతర్జాతీయ లావాదేవీల్లో మరింత సౌలభం కల్పించేందుకు వీలుగా Bharat Trade Net (BTN) ఏర్పాటు.

2030, ఏప్రిల్ 1 కి ముందు ఏర్పాటు చేసిన అంకుర సంస్థలకు ప్రయోజనాలు అందుబాటులోకి

CBC 15201/13/0010/2425

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68